TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 134 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, ఏప్రిల్ 14 , 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## అమరావతే మన రాజధాని

- హైదరాబాద్‌ను మించి అభివృద్ధి చేస్తా
- ప్రజావేదికతో మొదలైన జగన్ విధ్వంసం
- ఏపిని సర్వనాశనం చేసిన దుర్మార్గుడు
- పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తా
- తాడికొండ ప్రజాగళం సభలో చంద్రబాబు





*గుంటూరు,ఏప్రిల్13(పీపుల్స్ మోటివేషన్):*

ఎప్పటికీ అమరావతే రాజధాని అని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అమరావతిని నిర్మించి తీరుతామని తెదేపా అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని హైదరాబాద్ ను మించి అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేస్తే జగన్ తుంచారని అన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు తిక్కలోడికి ఓటేస్తే ఏపీకి రాజధాని లేకుండా చేశారని తెదేపా అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తాడికొండలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెయ్యి మంది జగన్‌లు వచ్చినా అమరావతిని అంగుళం కూడా కదల్చలేరన్నారు. అమరావతి రైతులు, మహిళల ( ▶ మిగతా 5వ పేజీలో..)

## 3 రోజులే ఛాన్స్



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఇప్పుడు దరఖాస్తు చేసుకొని ఓటు హక్కు పొందిన వారు కూడా ఈ ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 15తో ముగియనుంది 2006 మార్చి 31 లోపు పుట్టిన వారు ఓటు హక్కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఇప్పటికే 18ఏళ్లు నిండినా ఓటు హక్కు లేని వారు కూడా అప్లై చేసుకోవచ్చు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



హైదరాబాద్,ఏప్రిల్13(పీపుల్స్ మోటివేషన్) :

హైదరాబాద్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గుర్రంగూడ ఎక్స్ రోడ్డు వద్ద వేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పింది. దీంతో ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తేల్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## నేడు బిజెపి మేనిఫెస్టో విడుదల

5

- కాంగ్రెస్ హామీలకు ధీటుగా రూపకల్పన
- సంకల్ప పత్ర్ పేరుతో రూపొందించిన రాజ్‌నాథ్
- మోడీ,అమిత్‌షాల సమక్షంలో విడుదలకు సిద్ధం

## తిరుమల పవిత్రతను మంటగలిపిన ప్రభుత్వం

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సరిదిద్దుతాం
- తిరుపతి నాయకులతో పవన్ ఆవేదన

అమరావతి,ఏప్రిల్13(పీపుల్స్ మోటివేషన్):



తిరుమల క్షేత్ర పవిత్రతను అధికార వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, కోరి తెచ్చుకున్న అధికారులు మంటగలిపేసిన తీరు భక్తులను మనోవేదనకు గురి చేసిందని, కూటమి ప్రభుత్వంలో కచ్చితంగా ధర్మ పరిరక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులను సైతం అడ్డగోలుగా వాడుకునే కుట్రలకు అధికార పార్టీ నాయకులు తెర తీసిన విషయంపై సమగ్ర సమాచారం పార్టీ దగ్గర ఉందన్నారు. తిరుపతిలో బీజేపీ నేతలతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు అనుసరించాలని వ్యూహాలు, తిరుపతి అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై చర్చించారు.

6

## అంబేడ్కర్‌ను ప్రధానిగా అంగీకరించని గాంధీ

- నెహ్రూ ప్రభావంతో దూరం పెట్టిన మహాత్ముడు

2



## మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలి

- ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతాం
- 98శాతం హామీలు విస్మరించడం చంద్రబాబు ట్రాక్ రికార్డ్
- నేతన్నలకు పంగనామం పెట్టిన ఘనుడు బాబు
- చేనేత చెల్లెమ్మ లావణ్యకు మంగళగిరి టిక్కెట్ ఇచ్చా
- చేనేత కార్మికులతో ముఖాముఖిలో జగన్

మంగళగిరి,ఏప్రిల్13(పీపుల్స్ మోటివేషన్):

ఎన్నికల్లో మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలని వైకాపా అధినేత, సిఎం జగన్ పిలుపునిచ్చారు. 98శాతం హామీలు విస్మరించడం చంద్రబాబు ట్రాక్ రికార్డ్ అని జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతామని సూచించారు. జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్ర మంగళగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఎం జగన్ చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు.


ఆంధ్రప్రదేశ్ ఓపన్ స్కూల్ సొసైటీ

10th / INTER-ALL GROUPS (EM/TM)

అర్హులు :
గ్రామ వాలంటీర్లు / ఆశా వర్కర్లు
డ్రైవింగ్ లైసెన్స్ / అంగన్‌వాడి జాబ్స్

అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించుటకు అర్హత కలదు.

- రెగ్యులర్ 10వ తరగతిలో 11 పేపర్లు పరీక్ష రాయాలి.
- కానీ ఓపెన్‌లో 5 పేపర్లు మాత్రమే పరీక్ష రాయాలి.
- రెగ్యులర్ 10వ తరగతిలో సమానమైన మరియు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ సొసైటీ (గవర్నమెంట్) వారు అందిస్తున్న ఈ సర్టిఫికెట్ అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు.
- ఈ సర్టిఫికెట్ అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రమోషన్‌లకు మరియు ఇంటర్‌మీడియట్ చేరుటకు ఉపయోగపడును.
- సిలబస్ తక్కువ మరియు పాస్ కావడం సులభం.
- ఇంటర్ రెండు సంవత్సరాలు ఒకే సంవత్సరంలో ఖచ్చితంగా పాస్ అయ్యే అద్భుత అవకాశం.

DEGREE & P.G. DISTANCE EDUCATION

విద్యార్థులకు డైరెక్టుగా డిగ్రీ చదివే అవకాశం మరియు డిగ్రీ అయిన విద్యార్థులకు పి.జి. చేసుకొనుటకు అవకాశం.
ఈ సదవకాశాన్ని విద్యార్థులు / గవర్నమెంటు మరియు ప్రైవేటు ఉద్యోగస్తులు సద్వినియోగం చేసుకోవచ్చు.

| GROUP | COURSE | MEDIUM |
|---|---|---|
| BA | ALL GROUP | T/M |
| B.COM | GENERAL COMUTER | TM/EM |
| BBA | Bacherlor of Business Administration | |

| COURSE | MIDIUM |
|---|---|
| B.LISC | E/M |
| M.LISC | E/M |

| COURSE | MIDIUM |
|---|---|
| MBA | E/M |
| MCA | E/M |

| GROUP | COURSE | MEDIUM |
|---|---|---|
| MA | MHRM | E/M |
| | ENGLISH | E/M |
| | TELUGU | - |
| | HINDI | - |
| | HISTORY | T/M |
| | ECONOMICS | T/M |
| | POLITICAL SCIENCE | T/M |
| | SOCIOLOGY | T/M |
| | SANKRIT | - |
| M.Com | Banking Accountancy | E/M |
| MSW | Master of Social Work | E/M |

- MA : JOURNALISM AND MASS COMMUNICATION
- DIPLOMA IN FOOD PRODUCTION (EM)
- CERTIFICATE COURSE IN HIV COUNSELLING
- CERTIFICATE COURSE IN HOTEL & HOSPITAL HOUSE KEEPING

FOR DETAILS : 77991 46971

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## ఓట్ల కోసం అంబేడ్కర్ జపం!






దళిత జనోద్ధరణలో అన్ని పార్టీలది ఒకటే విధానంగా ఉంది. నేటికీ దళితుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు లేవు. వారిని ఓటుబ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప తమలో ఒకరిగా చూడడం లేదు. దీనికితోడు దళితుల్లో ఉపకులాల ద్వారా వారి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే మాల, మాదిగ అంటూ దళితులే రోడ్డెక్కేలా చేస్తున్నారు. దీని ఆధారంగా ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉన్న ఆయా పార్టీల పన్నాగాలను దళితులు గుర్తించడం లేదు. ఏటా అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహాలకు దండలేయడం...కొత్తగా విగ్రహాలు పెట్టడం వరకే ప్రభుత్వాలు బాధ్యత వహిస్తున్నాయి. భారీ విగ్రహాలను పెట్టి దళితజనోద్ధరణ అంటూ కాలం గడిపేస్తున్నారు. నేతలు కూడా అంబేడ్కర్ విగ్రహాలను పెట్టాలన్న డిమాండ్ తీసుకుని వచ్చి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ రకంగా వారిని ఎప్పటికప్పుడు మోసం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప వారిని తోటి మానవులుగా రాజకీయ నాయకులు భావించడం లేదు. వారికి సమాజంలో గౌరవం దక్కేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం లేదు. గ్రామాల్లో ప్రజలమధ్య వైషమ్యాలు లేకున్నా నాయకుల ఆలోచనలో అవి ఉన్నాయనడానికి మన నాయకుల తీరే నిదర్శనం. అంబేడ్కర్ ఆశయాలను పాటించడం.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలను అమలు చేయడం అన్నది పైకి కనిపిస్తున్న ముసుగు మాత్రమే. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య కాలంలో మన నాయకులంతా సమాజాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇప్పుడు రాజకీయ పార్టీలకు, నాయకులకు ఆయన పేరును జపించడం నిత్యకృత్యం కావడం వెనక ఓటుబ్యాంక్ రాజకీయం తప్ప మరోటి లేదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన అంబేడ్కర్ పేరు చెప్పుకుని అణగారిన వర్గాలను బుట్టలో వేసుకోవడం అన్న కళలో మన నాయకులు ఆరితేరారు. ఆయనకు భారీ విగ్రహాలు పెట్టి దండలు వేసి చేతులు దులుపు కుంటున్నారు. ఆయన ఆశయాలను తుంగలో తొక్కామన్న భావన రాకుండా నిత్యం అంబేడ్కర్ జపం చేస్తున్నారు. ఎంతో జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాల ఓట్లకోసం అంబేడ్కర్ పేరును వాడుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో అది బాగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ అయితే అంబేడ్కర్ పేరు ఉచ్చరించకుండా ఉండలేకపోతున్నారు. ఆయనకు మేమిచ్చిన గౌరవం మరెవరూ ఇవ్వలేదంటున్నారు. కానీ ఈనాడు నిత్యం అంబేడ్కర్ జపం చేస్తున్న వారంతా ఉన్నత కులాలు వారే. వారు ఏనాడు దళితులను ఉన్నతికి తీసకుని వచ్చేందుకు ప్రయత్నించడం లేదు. రాష్ట్రపతిని చేయడం దళిత ఉద్ధరణ అనుకుంటారు. పాలనా పగ్గాలు వారి చేతుల్లో లేకుండా ఉత్సవ విగ్రహాలుగానే వారిని చూస్తున్నారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే అంబేడ్కర్, పూలేలు ఎదుర్కొన్న వర్ణవివక్ష, కులవివక్ష జాఢ్యాలు ఇంకా సమిసి పోయాయని చెప్పగలమా ? అంటే చెప్పలేం. ఇంతగా విద్య అందుబాటులోకి వచ్చినా ఇంకా వారు అణగారిన వర్గాలు గానే మిగిలిపోతున్నారు. ఒకటి రెండు పదవులు వారి మొహాన పడేసి దళితజన ఉద్ధరణ జరిగిందన్న ప్రచారం చేసుకుంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. దళితబందు, పెన్షన్లు వంటివి ఇచ్చి ఆహా..ఓహో అంటూ కాలం గడుపుతున్నారు. దళిత ఉద్ధరణ గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ జగ్జీవన్ రామ్‌కు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా అడ్డుకున్న చరిత్రను మరచిపోలేం.. అందుకే దళితనేతను పాలనకు దగ్గరగా చేసిన చరిత్రను చూడడం లేదు. దళితులను సిఎం చేస్తానన్న కెసిఆర్ సైతం వారిని ఓటుబ్యాంక్ కోసం మభ్యపెట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ ఊదరగొట్టి తెలంగాణ సమాజాన్ని మోసం చేసి, పదేళ్ల పాటు ఆయనే సిఎంగా కొనసాగారు. దళితబంధు పేరుతో అక్రమాలకు తెరతీసారు. నిజంగానే మనం అంబేడ్కర్ మహాను భావుడి ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామా లేదా అన్నది నేతలతో పాటు దళితులు కూడా ఆలోచన చేయాలి. ఎన్ని దళిత వాడలను పురుద్ధరించారో.. ఎందరికి చదువు, ఉద్యోగాలు కల్పించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబేడ్కర్ ఆశించిన ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడంలో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలు గుర్తించాలి. దళితులంతా ఒక్కటే అన్న పట్టుదలతో సాగితే రాజకీయాల్లో పట్టు సాధించగలమని దళితులు గుర్తించాలి. అంతరాలు లేని సమాజం నిర్మించేందుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులే కులాల కుంపట్లు సృష్టించి దేశంలో అసమానతలను పెంచి పోషిస్తున్నారు. దీంతో కులవ్యవస్థ మరింత బలంగా వేళ్లూనుకుని సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. రాజకీయ నాయకులు ఎలాగూ మంచి చేయరు. కనీసం ప్రజలుగా మనమంతా ఆ మహనీయుడికి నివాళి అర్పించేందుకు ఆయన చూపిన మార్గంలో నడిచే ప్రయత్నం చేయాలి. అంటరాని కులాలు ఆర్థికంగా బలపడనిదే, రాజకీయాధికారం పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారం దొరకదని అంబేడ్కర్ ఆనాడే ప్రకటించారు. వారికి రాజ్యాధికారం వస్తే తప్ప ఈ అంటరానితనం, చిన్నచూపు చూడడం వేరుగా చూడడం వంటి సమస్యలు సమిసిపోతాయని భావించాడు. భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమంలో అంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తిస్థాయిలో మద్దతు లభించనేలేదు. గాంధీజి వర్ణ వ్యవస్థను భారత సమాజం ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని సమర్థించాడు. ఆనాడే అంబేడ్కర్‌ను ప్రధాని చేయాలన్న ఆలోచనకూడా గాంధీజీకి రాలేదు. ఇప్పటికైనా దళితులు ఐక్యత ప్రదర్శించాలి. అంబేడ్కర్ పేరుతో చేసే రాజకీయాలను దునుమాడాలి. ఎన్నికల్లో ఐక్యత చాటాలి. తమను రాజకీయంగా వాడుకుంటున్న నేతల నిజస్వారూపాలను గుర్తించాలి. అప్పుడే అంబేడ్కర్ మహాశయుడి ఆశయాలను సాధించగలం.

# దళితులంటే అప్పట్లో ఛీత్కారమే

- అంబేడ్కర్‌కూ తప్పని అవమానాలు
- జీవితంలో అనేక ఒడిదుడుకులు



**ముంబై,ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

1927లోనే మహాద్‌లో దళిత జాతుల మహాసభ జరిగింది. మహారాష్ట్ర గుజరాత్‌ల నుండి కొన్ని వేలమంది వచ్చారు. మహాద్ చెరువులోని నీటిని త్రాగేందుకు వీలు లేని కాలమది. అంటరానివారికి ఆ చెరువులో ప్రవేశం లేదు. అంబేద్కర్ నాయకత్వంలో వేలాదిమంది చెరువు నీరు స్వీకరించారు. ఈ సంఘటన మహారాష్ట్రంలో సంచలనం కలిగించింది. 1927లో ఛత్రపతి శివాజీ త్రిశతి జయంతి ఉత్సవాలు మహారాష్ట్ర అంతటా గొప్పగా జరిగాయి. కొలాబాలోని ఉత్సవ సంఘాధ్యక్షుడుగా ఉన్న బ్రాహ్మణుడైన పలాయ శాస్త్రి అంబేద్కర్‌ను సాదరంగా ఆహ్వానించాడు. ఆ ఉత్సవాలలో అంబేద్కర్ ప్రసంగిస్తూ పీష్వాల సామ్రాజ్య పతనానికి ముఖ్యకారణం అస్పృశ్యతను పాటించడమే అన్నాడు. ఈ ఒక్క మాట చూస్తే ఆనాడు అస్పృశ్యత ఎంత విశృంఖలంగా ఉందో చెప్పవచ్చు. బాల్యంలో అంబేద్కర్ ఎదుర్కొన్న అంటరానితన సమస్య అంతా ఇంతా కాదు. ఆనాడు మెహర్లను అస్పృశ్యులుగా పరిగణించిన కాలమది. వేసవిసెలవుల్లో మామగారున్న గోరెగావ్‌కు భీమ్‌రావ్, అన్న, మేనల్లుళ్ళతో పాటు వెళ్ళాడు. అనుకున్నట్లు, మామ స్టేషన్‌కు రాలేకపోయారు. స్టేషన్ నుండి, గ్రామానికి వెళ్ళటానికి బండిని కుదుర్చుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత బండివాడికి, వీళ్ళు మెహర్ కులస్థులని తెలిసింది. అందరినీ బండి నుండి దిగమన్నాడు. ఎండాకాలం. పిల్లలు ఆ బండివాణ్ణి బతిమాలుకొన్నారు. రెండింతలు బాడుగ ఇస్తామన్నారు. భీమ్‌రావ్ అన్న బండి తోలేటట్లు, బండివాడు నడచి వచ్చేటట్లు మాట్లాడుకున్నారు. ఆకలి దప్పులతో అలమటిస్తూ అర్ధరాత్రికి గోరేగావ్ చేరారు పిల్లలు. వీధికుళాయి నీరు తాగుతూ వున్న భీమ్‌రావ్‌ను కొట్టి మంచినీరు త్రాగకుండా గెంటివేశారు. కులంపేర భీమ్‌రావ్‌ను అవమానాలకు గురిచేశారు. 16వ ఏటనే పెద్దలు అంబేద్కర్‌కు పెళ్ళి చేశారు. అంబేద్కర్ తన 56 ఏట సారస్వత బ్రాహ్మణ కుటుంబా నికి చెందిన కుమారి శారదా కబీర్ ను పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్య 1935లో మరణించింది. 1956 అక్టోబరు 14న నాగ్‌పూర్‌లో అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించాడు. రామ్‌జీ సతారా వదలి పిల్లల చదువు కోసం బొంబాయి చేరాడు. భీమ్‌రావ్ ఎల్ఫిన్‌స్టన్ హైస్కూల్‌లో చేరి మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. సంస్కృతం చదువుకోవాలని ఆశించాడు. కులం అడ్డు వచ్చింది. ఇష్టంలేకున్నా పర్షియన్ భాష చదివాడు. బరోడా మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో బి.ఏ. పరీక్షల్లో నెగ్గాడు. పట్టభద్రుడైన వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కాని పై చదువులు చదవాలన్న పట్టుదలవల్ల ఉద్యోగంలో చేరలేదు. మహారాజుకు తన కోరికను తెలిపాడు. విదేశంలో చదువు పూర్తిచేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్లు పనిచేసే షరతుపై 1913లో రాజాగారి ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయం చేరాడు. 1915లో ఎం.ఏ. 1916లో పి.హెచ్.డి. డిగ్రీలను సంపాదించాడు. ఆనాటి సిద్ధాంత వ్యాసమే పదేళ్ల తర్వాత 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్సస్ ఇన్ ఇండియా' అను పేరుతో ప్రచురించబడింది. 1917 లో డాక్టర్ అంబేద్కర్‌గా స్వదేశం వచ్చాడు. అప్పటికాతని వయస్సు 27 ఏళ్లు. అస్పృశ్యుడొకడు అంతగొప్ప పేరు సంపాదించుకోవటం ఆనాటి అగ్రవర్ణాలవారికి ఆశ్చర్యం కల్గించింది. ఒప్పందం మేరకు మహారాజాగారి మిలిటరీ కార్యదర్శి అయ్యాడు. కాని ఆఫీసులో నౌకర్లు కాగితాలు ఆయన బల్లపై ఎత్తివేసేవారు! కొల్హాపూర్ మహారాజు సాహూ మహరాజ్ అస్పృశ్యతా నివారణకెంతో కృషి చేస్తుండేవాడు. మహారాజా సహాయంతో అంబేద్కర్ 'మూక నాయక్' అనే పక్షపత్రిక సంపాదకత్వం వహించాడు. సాహు మహారాజు ఆర్థిక సహాయంచేసి అంబేద్కర్ ని పై చదువులకి విదేశాలకు పంపించిండు. 32 సంవత్సరాల వయసులో డా.అంబేద్కర్, బార్-ఎట్-లా, కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి పట్టాలను పొందాడు. కాని ఆఫీసు జవానులు కూడా ఈయనను అస్పృశ్యుడుగా చూచారు. ఆ తరవాత జరిగిన పరిణమాలు అంబేద్కర్‌ను గొప్ప నేతగా అంతా గౌరవించారు.

## అంబేడ్కర్‌ను ప్రధానిగా అంగీకరించని గాంధీ

- నెహ్రూ ప్రభావంతో దూరం పెట్టిన మహాత్ముడు

**ముంబై, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

దేశంలో అంబేడ్కర్ ఎదుర్కొన్న వర్ణవివక్ష అంతాఇంతా కాదు. ఆయన జీవితమే అనుభవ పాఠంగా మారింది. స్వాతంత్ర్యానంతరం అంబేడ్కర్‌ను ప్రధానిని చేసివుంటే దేశ పరిస్థితి మరోటా ఉండేది. గాంధీ సైతం ఈ విషయంలో అంబేడ్కర్‌ను పక్కన పెట్టారనే చెప్పాలి. నెహ్రూ ప్రభావంతో ఆయన సుభాస్ చంద్రబోస్‌ను, స్వాతంత్ర్యానంతరం అంబేడ్కర్‌ను పక్కన పెట్టారు. 1927లో అంబేద్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ అంబేద్కర్ ఇలా అన్నాడు. బాలగంగాధర్ తిలక్ గనుక అంటరానివాడుగ పుట్టివుంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు'అని ఉండేవాడు కాదంటాడు. అస్పృశ్యతా నివారణెళి నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడని వ్రాశాడు. అంటే ఆనాడు అంబేద్కర్ కులతత్వవాదుల బాధను ఎంతగా అనుభవించాడో దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. అయితే అంటరాని వారుగా చూడబడుతున్న కులాల వారు తమ ఆత్మగౌరవాన్ని త్యాగం చేస్తూ సమాజ బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని అటువంటి వారిని ఇతర వర్ణాల వారందరూ గౌరవించాలని పేర్కొన్నారు. ఇలా కుల, అంటరానితన సమస్యకు గాంధీ సామాజిక,సాంస్కృతిక పరిష్కారం చూపగా అంబేద్కర్ ఈ విషయంలో గాంధీతో విభేదించాడు. ఎందుకంటే దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో ఈనాడు చూస్తున్నాం. దీనిని ఆనాడే అంబేద్కర్ మహాశయుడు ఊహించి ఉంటాడు. అందుకే ఆనాడే గాంధీతో అంబేద్కర్ విభేదించాడు. నిజానికి ఆనాడే గాంధీ చిత్తశుద్ధితో ప్రయత్నం చేసివుంటే ఇవాళ సమాజం ఇంకెంతో ముందుకు..అంటే అంబేద్కర్ ఆశించిన విధంగా పోయి వుండేది. గాంధీజీతో అనేక విషయాలలో విభేదించినా తాను మతం మారదలచు కున్నప్పుడు మాత్రం దేశానికి చాలా తక్కువ ప్రమాదకరం అయిన దానినే ఎన్నుకుంటానని ప్రకటించాడు. బౌద్ధం భారతీయ సంస్కృతిలో భాగమని, ఈ దేశ చరిత్ర సంస్కృతులు, తన మార్పిడివల్ల దెబ్బతినకుండా చూచానన్నాడు. హిందువుగా పుట్టిన అంబేద్కర్ హిందువుగా మరణించలేదు. నిరంతర కృషితో సాగిన ఆయన జీవితం ఉద్యమాలకు ఊపిరిపోసింది. నిజానికి ఆయన అనుభవించిన కులవివక్ష కారణంగానే పట్టుదలతో సమాజంలో ముందుకు రాగలిగాడు. ఆయన అనుసరించిన లేదా ప్రవచించిన మార్గం సాకారం కావాలంటే దళితుల కు అధికారం దక్కాలి. వారు ధైర్యంగా పాలకులుగా నిలబడగలగాలి. అగ్రవర్ణాల పెత్తనంలో వారు మగ్గినంత కాలం ఈ దేశంలో కులవ్యవస్థ పోదు. కులరహిత సమాజం కోసం గట్టిగా పోరాడాలి. భారత సమాజంలో ఇంకా కులవ్యవస్థను ప్రోత్సహించే చర్యలకు మంగళం పాడాలి. అప్పుడే ఆర్థిక అసమానతలు లేని భారత్ ఉద్భవిస్తుంది. అదే అంబేద్కర్‌కు మనమిచ్చే నివాళి అవుతుంది.

## దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు

- బ్రిటిష్ సామ్రాజ్యంలోనే అంబేడ్కర్ పట్టు
- విభేదించిన గాంధీ మహాశయుడు

**న్యూఢిల్లీ, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

భారతదేశంలో1919 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు ఎలా పనిచేస్తున్నాయో అధ్యయనం చేయడానికి, నూతన రాజ్యంగ సంస్కరణల కోసం సూచించేందుకు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్ భారతదేశాన్ని 1928లో పర్యటించింది. ఆ పర్యటన అనంతరం ఆ కమిటీ బ్రిటిష్ ప్రభుత్వానికి అందించిన నివేదికను చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం మూడు రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పరచింది. ఈ సమావేశాలు 1930, 1931, 1932 లలో జరిగాయి. ఈ మూడు సమావేశాలకు అంబేద్కర్ హాజరు కాగా రెండవ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ తరపున గాంధీ హాజరు అయ్యారు. ఈ సమావేశాంలోనే గాంధీకి అంబేద్కర్‌కు మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ఇవ్వాలని పట్టుబట్టగా, అలా ఇస్తే హిందూ సమాజం విచ్ఛిన్నమవుతుందని అందుకు గాంధి ఒప్పుకోలేదు. ఏకాభిప్రాయం కుదరక పోవడంతో రెండవ రౌండ్ టేబుల్ సమావేశం నుండి గాంధీ బయటకు వచ్చేసారు. 1932 లో రామ్సే మెక్ డోనాల్డ్ 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించడం జరిగింది. దీని ప్రకారం దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రతిపాదించారు. ఈ ప్రకటన వెలువడే నాటికి గాంధి శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా అరెస్ట్ అయి ఎరవాడ జైలులో ఉన్నారు. ఈ ప్రకటన గూర్చి తెలుసుకొని గాంధీ నిరాహారదీక్ష చేపట్టారు. అంబేద్కర్ పై నైతిక ఒత్తిడి పెరిగింది. చివరికి గాంధీకి అంబేద్కర్‌కు మధ్య పూనా ఒప్పందం కుదిరి కమ్యూనల్ అవార్డ్ కన్నా ఎక్కువ స్థానాలు ఉమ్మడి నియోజక వర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీని తర్వాత గాంధి 'హరిజన్ సేవక్ సమాజ్' ఏర్పరచి అస్పృస్యత నివారణకు కృషి చేసాడు. అంబేద్కర్ ను కూడా ఇందులో భాగస్వామిని చేసాడు.. కాని అంటరానితన నిర్మూలనలో గాంధీకున్న చిత్తశుద్ధి మిగిలిన కాంగ్రెస్ నాయకులకు లేదు. దీనితో అంబేద్కర్ గాంధి ఉద్యమం నుండి బయటకు వచ్చి ప్రత్యేకంగా దళిత సమస్య పరిష్కారానికి ఆలిండియా డిప్రేస్సేడ్ క్లాస్ కాంగ్రెస్, ఆలిండియా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వంటి అనేక రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా దళితులను సమీకరించే ప్రయత్నం చేసారు. ఈ సందర్భంలో క్విట్ ఇండియా ఉద్యమం, ఆ తరువాత దేశ విభజనతో కూడిన స్వాతంత్య్రం రావడం జరిగాయి.

# అంబేడ్కర్‌పై రాజ్యాంగ రచన భారం

- ఆయన పుస్తకాలు నేటికీ ప్రామాణికం

**న్యూఢిల్లీ, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

రాజ్యంగ పరిషత్తు సభ్యుడిగా, మంత్రివర్గ సభ్యుడిగా అంబేద్కర్ చేసిన కృషి అనన్య సామాన్యమైనది. ఆయన రాజ్యంగ భారాన్నంతా ఒక్కడే తన భుజస్కంధాలపై మోసాడు. రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగా అంబేద్కర్ విశేషంగా శ్రమించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. నాటి కేంద్రమంత్రి టి.టి కృష్ణమాచారి ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'రాజ్యాంగ రచనా సంఘంలో నియమితులైన ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాలో వుండి పోయారు. ఇంకొకరు రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులయ్యారు. ఉన్న ఒక్కరిద్దరు ఢిల్లీకి దూరంగా ఉన్నారు. అందువల్ల భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా వుంటుందనటంలో ఏలాంటి సందేహం లేదన్నాడు. కేంద్ర మంత్రిమండలిలో న్యాయశాఖ మంత్రిగా వుండి 1951 అక్టోబరులో మంత్రి పదవికి రాజీనామా చేశాడు. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రొవిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్ధా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొలస్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు. మహామేధావిగా, సంఘసంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా, కీర్తిగాంచిన డాక్టర్ భీమారావ్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6 న కన్ను మూశాడు. భారత రాజ్యాంగ శిల్పిగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, సంఘసంస్కర్తగా, మహామేధావిగా విఖ్యాతుడిగా పేరొందారు. అంబేద్కర్ స్మృతికి నివాళులర్పిస్తూ, ఆ మహనీయునికి ' భారతరత్న ' అవార్డును భారత ప్రభుత్వం ప్రకటించింది.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం । ఏప్రిల్ । 14 । 2024


# విజయవంతమైన కూటమి పార్టీల ఉమ్మడి సమావేశం






**దేవనకొండ, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**

శనివారం దేవనకొండ మండల కేంద్రంలోని లక్ష్మీరంగా కళ్యాణ మండపంలో టీడీపీ, బిజెపి మరియు జనసేన కూటమి కార్యకర్తల సమావేశం జనసేన ఇంచార్జి తెర్నెకల్ వెంకప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలూరు ఉమ్మడి కూటమి అభ్యర్థి వీరభద్ర గౌడ్ హాజరయ్యారు. అలాగే ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కోఆర్డినేటర్ సురేష్ బాబు, టీడీపీ నాయకులు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు, బీజేపీ నాయకులు వెంకటరమణ అలాగే దేవనకొండ మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్లు, ఎంపిటిసిలు, జనసేన, బిజెపి అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు అలాగే నందమూరి నారా అభిమానులు, బివిజి అభిమానులు భారీఎత్తున పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుల మాట విని వాలంటీర్లు రాజీనామా చేయవద్దు

- వాలంటీర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్న వైసీపీ ప్రభుత్వం
- వాలంటీర్లకు రూ.10 వేల జీతం పెంచుతామన్న చంద్రబాబు

**నంద్యాల, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**



రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తక్కువ గౌరవ వేతనంతో వాలంటీర్ల చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నదని, ఈ ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తలుగా పనిచేయించేందుకు వాలంటీర్లతో వైసీపీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయించడం అన్యాయమని నంద్యాల టీడీపీ లోకసభ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎన్నికల కార్యాలయంలో బైరెడ్డి శబరి మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో జగన్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలండర్ అని ఇదేళ్ళు ముఖ్యమంత్రిగా కొనసాగి నిరుద్యోగులకు ఉద్యోగం, ఉపాధి లేకుండా మోసం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డిఎస్సి ఎక్కడ అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వ ఖాళీ ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయడం లేదని జగన్ ప్రభుత్వాన్ని నీలాదీశారు. వాలంటీర్లతో వైసీపీ నాయకులు రాజీనామా చేయిస్తూ రాష్ట్రంలో కొత్త డ్రామాకు తెరలేపారని, డిగ్రీ, పీజీ, పిహెచ్డిలు పూర్తి చేసి ఉద్యోగం దొరకక, చెడు అలవాట్లకు వెళ్ళకుండా, ఖాళీగా ఇంటి వద్ద కుటుంబానికి భారం కాకుండా రూ.5000 ల గౌరవ వేతనంతో వాలంటీర్లు పనిచేస్తున్నారని, వారిని బెదిరించి రాజీనామా చేయిస్తూ ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తలు పనిచేయించాలనుకోవడం అన్యాయం అన్నారు. రాష్ట్రంలో త్వరలో టీడీపీ విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు కాబోతున్నారని, వాలంటీర్లకు రూ.10 వేల గౌరవ వేతనం వస్తుందని, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రెండు రోజులుగా నంద్యాలలో క్లస్టర్ సమావేశాలు పెట్టి వాలంటీర్లు రాజీనామా చేయాలని వత్తిడి చేయడం సరికాదాన్నారు. ఎవరికి వాలంటీర్లు బయపడవద్దని తాము అండగా ఉంటామని టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్. బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన రైతుబిడ్డ మరియదాస్

**మిదుతూరు, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**



మిదుతూరు మండలం వీపనగండ్ల గ్రామానికి చెందిన నల్లమల్ల కుమార్ మొదటి కుమారుడు మరియదాస్ తాజాగా విడుదలైన ఇంటర్ ఫలితాలలో సత్తా చాటాడు. నందికొట్కూరు పట్టణంలోని శ్రీ నంది జూనియర్ కళాశాలలో చదువుతున్న మరియదాస్ ఇంటర్ బైపీసీలో 860/1000 మార్కులు సాధించి గ్రామంలోనే మొదటి స్థానం సాధించి ప్రతిభ కనబరిచాడు. దీంతో గ్రామ యువ నాయకులు దామోదర్, దినేష్, విద్యార్థి మరియదాసు ను ప్రత్యేకంగా అభినందించారు. మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

## గూల్యం గాదిలింగేశ్వర దర్శనం చేసుకున్న జిల్లా వైసీపీ అధ్యక్షురాలు





**హాలహర్వి, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**

ఈరోజు కర్నూలు జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షురాలు చిత్ర సత్య నారాయణమ్మ, గడ్డం రామకృష్ణ దంపతులు హాలహర్వి మండలం పరిధిలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన గూల్యం గ్రామంలో వెలిసిన శరణు గాదలింగప్ప తాత దర్శనం చేసుకోవడం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూజారులు ఆమెకు ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేసి హారతి ఇవ్వడం జరిగింది. అనంతరం మీడియాతో అధ్యక్షులు చిత్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలని మంచి వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని కొద్ది రోజులలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో మరల వైఎస్సార్సీపీ పార్టీ ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిపించాలని రాష్ట్ర%శీ%లో ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజల క్షేమమే ధ్యేయంగా పనిచేస్తు మంచి పరిపాలన అందించే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకోవడం జరిగిందని అలాగే కర్నూలు జిల్లాలో వైఎస్సార్సీపీ పార్టీ అభ్యర్థులు విజయడంక మోగిస్తారని మరలా మా జగన్ ప్రభుత్వమే వస్తుందని వచ్చిన వెంటనే కర్నూలు పార్లమెంట్ లోని ఆలూరు నియోజకవర్గ జీవనాడి అయినటువంటి పేదవతి ప్రాజెక్ట్, నగరడోనే రిజర్వాయర్లు పూర్తి చేస్తామని ఆలూరు నియోజకవర్గంలో వలసలు వెళ్లకుండా ఉపాధి కల్పిస్తామని టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ, జింకల పార్కు ఏర్పాటు చేస్తామని తేలియజేశారు. అనంతరం గూల్యం, బొల్లూరు, కోగిల తోట, ఎల్లార్తి గ్రామాలలో పర్యటించి పలు ప్రజా సమస్యలను తెలుసుకోవడం జరిగింది మరలా ఈ ప్రభుత్వం వస్తే మీ సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న, మాజీ ఎంపీపీ బసప్ప, కర్నూలు జిల్లా జడ్పిటిసి వైస్ చైర్మన్ శేషప్ప, మద్దిలేటి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, కుమార్ స్వామి, హులే బీడు వెంకటేష్, గోవిందు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఎల్లప్ప, వీరేశ, వైయస్సార్సీపి సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ ఆలూరు లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ న్యూస్‌పై.. ఫోకస్..!!

- నకిలీ కథనాల ప్రచురణ, ప్రసారం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

**కర్నూలు, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**

సార్వత్రిక, లోక్ సభ ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో భాగంగా... సోషల్ మీడియాలో ప్రసారమయ్యే కథనాలపై ఎన్నికల కమీషన్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం.. ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), లా & ఆర్డర్, ఎన్నికల సమగ్రత, ఎన్నికల ప్రణాళిక/నిర్వహణ తదితర అంశాలపై నకిలీ కథనాల ప్రచురణ, ప్రసారాన్ని ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించడంగా పరిగణించబడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ద్వేషపూరిత ప్రసంగం, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలు, మొదలైన సందేశాలు సోషల్ మీడియాలో ప్రసారం అయితే.. అలాంటి వాటిని చట్టవ్యతిరేకమైన సందేశాలుగా గుర్తించి.. సంబంధిత సందేశాలను పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.. ఎలాంటి సందేశాలు ఎలాంటి చట్ట వ్యతిరేకతకు దారితీస్తాయి, అందుకు కారకులైన వారికి చట్టపరంగా ఏయే సెక్షన్లు వర్తిస్తాయి ? అనే వివరాలు ఈ క్రింది విధంగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు..

1) IPC సెక్షన్ 505 : ఈ సెక్షన్ క్రింద ప్రజా దుష్ప్రచారానికి దారితీసే ప్రకటనలు, సందేశాలు (1) ఎవరైనా ఇతర తరగతి లేదా కమ్యూనిటీకి వ్యతిరేకంగా ఏదైనా నేరానికి పాల్పడేటటువంటి ఇతర వర్గాన్ని లేదా సంఘాన్ని ప్రేరేపించే ఉద్దేశ్యంతో.. ఏదైనా ప్రకటన, పుకారు లేదా నివేదికను చేసినా, ప్రచురించినా లేదా ప్రసారం చేసినా.. వారికి జైలు శిక్ష విధించబడుతుంది. ఈ శిక్ష మూడు సంవత్సరాల వరకు పొడిగించవచ్చు, లేదా జరిమానా లేదా రెండింటినీ అమలు చేయవచ్చు.

2) RP చట్టం 1951 సెక్షన్ 125 : ఎన్నికలకు సంబంధించి వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం జరిగితే ఈ చట్టం క్రింద శిక్షకు అర్హులు.

3) IPC సెక్షన్లు 153A : మతం, జాతి, జన్మస్థలం, నివాసం, భాష మొదలైన వాటి ఆధారంగా వివిధ సమూహాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందించడం మరియు సామరస్య పరిరక్షణకు హాని కలిగించే చర్యలు చేయడం.

4) IPC సెక్షన్లు 153B : జాతీయ-సమగ్రతకు విఘాతం కలిగించే ఆరోపణలు, వాదనలు.

5) IPC సెక్షన్ 295A : ఉద్దేశపూర్వక, హానికరమైన చర్యలు. ఒక తరగతి లేదా మతం వారు.. వేరొక మతం లేదా మత విశ్వాసాలను అవమానించడం ద్వారా వారి మతపరమైన భావాలను ఆగ్రహానికి గురిచేయడానికి ఉద్దేశించబడింది.

6) IPC సెక్షన్ 298 : ఈ చట్టం ప్రకారం.. మతపరమైన భావాలను గాయపరిచే ఉద్దేశ్యంతో పదాలు మొదలైనవి చెప్పడం

7) RP చట్టం 1951 సెక్షన్ 123(3A) : మతం, జాతి, కులం, కమ్యూనిటీ లేదా భాష ప్రాతిపదికన, అభ్యర్థి లేదా అతని ఏజెంట్ లేదా మరే ఇతర వ్యక్తి ద్వారా భారతదేశంలోని వివిధ తరగతుల పౌరుల మధ్య శత్రుత్వం లేదా ద్వేష భావాలను ప్రోత్సహించడం లేదా ప్రోత్సహించడానికి ప్రయత్నించడం ఒక అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ యొక్క సమ్మతి ఆ అభ్యర్థి యొక్క ఎన్నికల అవకాశాలను మెరుగుపరచడానికి లేదా ఏదైనా అభ్యర్థి ఎన్నికను పక్షపాతంగా ప్రభావితం చేయడానికి సంబంధించినది.

8) RP చట్టంలోని సెక్షన్ 94 : ఓటింగ్ గోప్యత ఉల్లంఘన..

9) IPC సెక్షన్ 171 C : ఎన్నికలలో మితిమీరిన ప్రభావం (1) ఎవరైనా స్వచ్ఛందంగా జోక్యం చేసుకున్నా లేదా ఏదైనా ఎన్నికల హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడంలో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినా, ఎన్నికల్లో అనవసర ప్రభావానికి లోనవుతారు.

10) IPC సెక్షన్ 171 G : ఎన్నికలకు సంబంధించి తప్పుడు ప్రకటన అనేది.. ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేయాలనే ఉద్దేశ్యంతో.. అది అబద్ధమని తనకు తెలిసినా లేదా అబద్ధమని నమ్ముతున్న విషయాన్ని వాస్తవ రూపంగా ఎవరు ప్రచురించినా.. అది వ్యక్తిగత పాత్రకు సంబందించిందే అని, చట్టవ్యతిరేకమైన చర్యగా శిక్షకు అర్హులు.

11) RP చట్టం 1951 సెక్షన్ 126(1)(b) : సైలెన్స్ పీరియడ్ లో ఒపీనియన్ పోల్స్ నిషేధం..

12) RP చట్టం 1951 సెక్షన్ 126A : ఎగ్జిట్ పోల్ యొక్క పరిమితి - R.P. చట్టం, 1951లోని సెక్షన్ 126A ప్రకారం.. నిర్ణీత వ్యవధిలో ఎగ్జిట్ పోల్ నిర్వహించడం మరియు వాటి ఫలితాలను ప్రచారం చేయడాన్ని నిషేధిస్తుంది.

13) IPC సెక్షన్ 471 నకిలీ డాక్యుమెంట్ లేదా ఎలక్ట్రానిక్ రికార్డును నమ్మదిగినదిగా లేదా నిజమైనదిగా ఉపయోగిస్తే, అతను ఆ మేరకు శిక్షించబడతాడని కలెక్టర్ వివరించారు.

## మౌలిక వసతులు కల్పించడంలో వైసిపి విఫలమయ్యింది : ఎన్ ఎండి ఫిరోజ్

**నంద్యాల, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**

నంద్యాల పట్టణం 25వ వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు విజయ గౌరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఏ వార్డులో తీసుకున్న డ్రైనేజీ సమస్య ,రోడ్ల సమస్య, మౌలిక వసతులు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందని ఆయన విమర్శించారు. కాబట్టి ప్రజలు వీటన్నిటిని గమనిస్తున్నారని రాబోయే 2024 మే 13 న జరిగే ఎన్నికల్లో స్థానికుడైన నంద్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, మరియు బైరెడ్డి శబరిని ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీకటి ప్రసాద్, కాజా హుస్సేన్, సాయిరాం రాయల్, నాగరత్నమ్మ, మంజుల సుబ్బరాయుడు, పొన్నాపురం వడ్డే జనార్ధన్, జేపీ బ్యాంక్ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బేతంచర్ల కెజిబివి విద్యార్థుల ప్రతిభ



**బేతంచర్ల, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బేతంచెర్ల పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో 2023-24 లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.అబిదా బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న మొదటి సంవత్సరం 16 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయగా 14 మంది విద్యార్థులు పాసై 87 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం లో అభ్యసించిన విద్యార్థులు 21 మంది బాలికలు పరీక్షలు రాయగా 18 మంది విద్యార్థులు పాసై 86 శాతం ఉత్తీర్ణతతో సాధించినట్లు ఆమె తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం టాపర్ ఎస్.లీలావతి 500 మార్కులకు గాను 463 మార్కులు సాధించిందన్నారు. ద్వితీయ సంవత్సరం టాపర్ ఎస్. మనీత 1000 మార్కులకు గాను 881 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచిందని ఆమె అన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. అబిదా బేగం మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు కేక్ కటింగ్ చేసుకుని తమ ఆనందాన్ని వ్యక్తపరుచుకున్నారు.

## విజయ సంకల్ప సభకు బీజేపీ నాయకులు




**నర్సంపేట, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):**

శనివారం రోజున మహబూబాబాద్ పార్లమెంట్ పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయసంకల్ప సమ్మేళన సభ కు బయలుదేరిన నర్సంపేట బిజెపి పట్టణ కమిటీ మరియు బూత్ అధ్యక్షులునర్సంపేట నియోజకవర్గ యువ నాయకులు డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మరియు నర్సంపేట పట్టణ బీజేపీ అధ్యక్షులు శీలం రాంబాబు ఆధ్వర్యంలోమహబూబాబాద్ లో జరిగే బూత్ అధ్యక్ష విజయ సంకల్ప సభకు బయలుదేరారు. ఇట్టి కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కమిటీ మరియు వివిధ బూత్ అధ్యక్షులు పాల్గోన్నారు.

## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆది మూలపు సతీష్





**కర్నూలు, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు మండలం నందనపల్లె గ్రామ పంచాయతీకి చెందిన వెంకయ్య పల్లె, ప్రేమగిరి, అభయగిరి గ్రామాలలో, కోడుమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ శనివారం పర్యటించారు. తదనంతరం సంక్షేమ అభివృద్ధి కొనసాగాలంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, జడ్పిటిసి ప్రసన్నకుమార్, ఎంపీటీసీ శేఖర్, వైస్ ఎంపీపీ నెహెమియా, వెంకయ్య పల్లె దేవస్థానం చైర్మన్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యంపై గారడీ తనిఖీలు





- యథేచ్ఛగా బెల్ట్ దందా ఎన్నికల కోడ్ ఉల్లంఘన నిబంధనలు బేఖాతారు
- కోడ్ అమలులో ఉన్న ఆగని అక్రమ మద్యం అమ్మకాలు
- తనిఖీలు శూన్యం... తగ్గేదే లేదంటున్న వ్యాపారుల తీరు
- ఎక్సైజ్ అధికారులు ప్రోత్సహిస్తున్నారని పలు ఆరోపణలు

**నెక్కొండ, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్) :**

నెక్కొండ మండల కేంద్రంలో బెల్ట్ షాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. సాధారణ సమయాల్లో ఎక్సైజ్ శాఖ అధికారుల అండదండలతో వైన్‌షాపులను తలపించే విధంగా దందా సాగిస్తున్న బెల్ట్‌షాపు ఓనర్లు.. ఎన్నికల సమయంలోనూ పెద్దగా వెనకడుగు వేయకపోవడం గమనార్హం. వైన్‌షాపులకు అనుబంధంగా నడుస్తున్న బెల్ట్‌షాపులు ఇంకా దర్జాగానే అమ్మకాలు సాగిస్తుండటం గమనార్హం. పోలీసులు, ఎక్సైజ్ బృందాల దాడులు ఏ మాత్రం కూడా లేకపోవడంతో లక్షల విలువ చేసే మద్య%శీ% బెల్ట్ షాపులకు అమ్మకాలు జరుగుతున్నాయని జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. అయితే ఎన్నికల గిరాకీ కూడా కాసింత ఎక్కువగానే ఉండటంతో సాధారణ సమయంలో రూ.20అదనాన్ని ఇప్పుడు రూ.30 నుంచి 40 వరకు అదనంగా రేట్లతో విక్రయిస్తున్నారు.

**వైన్ షాప్ యజమానుల సహకారంతోనే బెల్ట్ దందా..**

మండల కేంద్రంలో బెల్ట్ షాపుల దందా మూడు పూల్ బాటిళ్లు ఆరు బీర్ బాటిల్ గా కొనసాగుతోంది. ఎన్నికల నిబంధనలో భాగంగా లైసెన్స్ పొందిన వైన్ షాప్ మినహా ఎలాంటి బెల్ట్ షాపులు నిర్వహించడానికి వీలు లేదు. కానీ మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ యధాతథంగా కొనసాగుతోంది అని, బెల్ట్ షాపులు కొనసాగడానికి చాలావరకు వైన్ షాప్ యజమానులు బెల్ట్ షాపులకు మద్యం అమ్ముతూ తమ ఆదాయానికి లోటు లేకుండా చేసుకుంటున్నారు మండల కేంద్రంలో స్థానికుల నుండి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైన్ షాప్ యజమానులు తమ లాభాల కోసం బెల్ట్ షాపుల నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నారని, ఇంతకుముందు ఒక్కో గ్రామంలో 10 నుండి 20 వరకు ఉన్న బెల్టు షాపులను అలాగే కొనసాగిస్తూ పైకి మాత్రం బెల్ట్ షాపులకు మద్యం అమ్మటం లేదంటూ వైన్ షాప్ యజమానులు నమ్మబల్కుతున్నారని మండల కేంద్రంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

**నిద్రావస్థలో ఎక్సైజ్ అధికారుల దాడులు..**

మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా బెల్ట్ షాపులలో మద్యం అమ్ముతున్న వాటిని అదుపు చేసే దిశగా ఎక్సైజ్ అధికారులు కనిపించడం లేదని మండల ప్రజలు భావిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపు యజమానులు ఎన్నికల కోడ్ పేరు చెప్పి, మరి ఎక్కువ రేట్లకు మద్యాన్ని అమ్ముతున్నప్పటికీ బెల్ట్ షాపులను కట్టడి చేయవలసిన ఎక్సైజ్ అధికారులకు బెల్ట్ షాపులు కనిపించడం లేదా...? అని, ఎన్నికల కోడ్ కు ముందు లాగే ఇప్పుడు కూడా బెల్ట్ షాపులపై దాడులు చేయకుండా మద్యం షాపు యజమానులతో చేతులు కలిపారా...? అని గ్రామాల్లోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు గ్రామాల్లో దాడులు ముమ్మరం చేసి ముందు నిద్రను వీడి బెల్ట్ షాపులను కట్టడి చేయాలని, బెల్ట్ షాపులకు అండగా ఉన్న వైన్ షాప్ యజమానుల పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కోట్ల జనం నమ్మే మహనీయునిపై ఓటు రాజకీయమా.....?



**జై భీమ్ స్వామి**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి.

అంబేద్కర్ అంటే తెలియనటువంటి వ్యక్తులు నేటి సమాజంలో ఎవరూ లేరు డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ ఒక దళిత గిరిజన వాడలో జన్మించినటువంటి నిన్న వర్గ కులానికి చెందినటువంటి ఓ మహోన్నత వ్యక్తి రాజకీయప్రజాస్వామ్యం కంటే సామాజిక ప్రజా స్వామ్యాన్నే ఎక్కువగా ఆకాంక్షించిన అంబేద్కర్ ఆలో చనకు విరుద్ధంగా నేటి ప్రభుత్వాలు దిమ్మలు కట్టి బొమ్మలు పెట్టి మభ్యపెడుతున్నాయి. ఈ విషయాన్ని దళిత,బహుజన మేధోవర్గాలు గ్రహించాలి. అంబేద్కర్ ఒక వర్గానికి చెందినటువంటి వ్యక్తి కాదు ఈ దేశ ప్రజలందరికీ మేధోసంపత్తి కలిగినటువంటి వ్యక్తి భవిష్యత్ తరాలల్లో పెంపొందించవలసిన అంబేద్కర్ స్ఫూర్తిని పక్కదోవ పట్టిస్తున్నారనే సంగతి సైతం గుర్తించాలి. ఈ దేశంలో సామాజిక వెలివేతకు గురైన కోట్లాదిమంది స్వరం తానోక్కడే అయి పోరాడిన ఆ యోధుని సిద్ధాంతాలు ఆచరణలోకి తెస్తూ, ఆ సమోన్నత స్త్రీ వియోచకుడిని, రాజనీతి జ్ఞుడిని ఓటు బొమ్మను చేసి ఆడుకుంటున్న వారి ఆలోచనలను సంకెళ్లువేయాలి. అదే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని ప్రభుత్వాలకు సైతం తెలియాలి. నిన్న వర్గ కులానికి చెందిన వాడు దళితుడు అంటూ పాఠశాలల నుంచి వెలివేసిన ప్రకృతి కల్పించిన చెరువులో నీటిని తాగినప్పుడు వెలివేసిన సామాజిక హితం కోసం నిరంతరం ఒక అన్వేషయు ఈ దేశ రూపు రేఖలు మార్చే దిశగా ప్రయాణించినటువంటి మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దళిత వార్డులలో ప్రతి మారుమూలపేటలలో అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం అంటే దళితులకు ఒక పండుగ కాదు మహోద్యమం ఈ పరిస్థితి పసిగట్టిన రాజకీయ పార్టీలు అంబేద్కర్ విగ్రహాలతో లబ్ధి పొందడం కోసం నిత్యం ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే గతంలో మాయావతి ఉత్తరప్రదేశ్ ల్లో స్మృతివనం కోట్ల రూపాయలతో నిర్మించారు. గత సంవత్సరం తెలంగాణలో కెసిఆర్ భారీ అంబేద్కర్ విగ్రహాన్ని 146 కోట్ల రూపాయలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరియొక అడుగు ముందుకు వేసి దళితుల ఓటు బ్యాంకు రాజకీయాల కోసం 400 కోట్ల రూపాయలతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో స్ఫూర్తి వనాన్ని కట్టించారు. ఇలా ఎప్పటికప్పుడు ఈ మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని పెట్టడానికి ఆరాధ్య దైవంగా కొలుస్తే ప్రజల నమ్మకాలను కొల్లగొడుతూ ప్రభుత్వ పాలకులు,ప్రభుత్వ అధికారుల సైతం వారి స్వలాభాల కోసం గురికావడానికి మనం నిరంతరం చూస్తూనే ఉన్నాం. ఇలా దేశమంతా పుట్టుకొస్తున్న స్మృతి వనాల మధ్యలో ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్న భారీ అంబేద్కర్ విగ్రహాల ప్రభుత్వ వైఖరిని తేటతీర్ణం చేస్తున్నాయి. అంబేద్కర్ ఆశించినటువంటి విద్య, వైద్యం, కూడు గూడు, గుడ్డ, నేటికీ అందించలేనటువంటి ప్రభుత్వాలు మన కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పేరు చూపిస్తూ నిరుపేదలనువైద్యానికి దూరం చేస్తున్నారు. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యారంగం కుంటూబడిపోయింది. 90 శాతం ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో విద్యాసంస్థలు వెలవెలబోతున్నాయి మధ్యాహ్న భోజనం పథకం అమలు అందంత మాత్రాన ఉంది ఇక వసతి గృహాలు గురుకుల పాఠశాలల పరిస్థితి చెప్పనక్కర్లేదు. బియ్యంలోనూ అన్నంలోనూ పురుగులు పడటం కాదు,ఏకంగా పథకాలలోనే పందికొక్కులు పడ్డాయని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లాంటి విద్యార్థి సంఘాలు ఎప్పటికప్పుడు మొరపెట్టుకుంటున్న పట్టించుకోని నాధుడే లేడు ఈ లోపాలను కప్పిపుచ్చుకో వడానికే నాసిరకం బూట్లు బట్టలు బ్యాగులు పంపిణీ చేస్తున్నారనే విమర్శల్లో వాస్తవం ఉంది. ఇంటర్మీడియట్ విద్య నుంచి గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ డిగ్రీల వరకు పేదలను విద్యకు దూరం చేసే గందరగోళం సృష్టించారనే చెప్పాలి. అంబేద్కర్ ఇలాంటి విద్య విధానాన్ని కోరలేదు ఆయన ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల ప్రధమకర్తవ్యం కావాలని ఆకాంక్షించారు. అన్నగారిన వర్గాలకు నిమ్న జాతులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండడం కోసం నిరంతరం ఉద్యమించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వాలు దళిత పేద బడుగు బలహీన వర్గాల నిన్న జాతులకు చెందినటువంటి నిరుపేదలను ఓటు వేసే యంత్రాలుగా కాకుండా వారి అభివృద్ధికై పాటుపడాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశించినటువంటి ఆశయాలను మునుముందుకు తీసుకెళ్లాలని అదే ఆయనకు నిజమైన నివాళి.

# సిఎం సమక్షంలో కాంగ్రెస్‌లోకి మెదక్ బిజెపి నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

అధికార పార్టీ కాంగ్రెస్‌లోకి నాయకుల వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇటీవల కొందరు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు చేరగా.. శనివారం బీజేపీ నుంచి మరో ఇద్దరు లీడర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ పులిమామిడి రాజు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు సీఎం రేవంత్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే మక్తల్ బీజేపీ నేత జలంధర్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి పులిమామిడి రాజు, మక్తల్ నుంచి జలంధర్ రెడ్డిలు బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయారు.

# వెంకటేశ్వర స్వామి, మానస సరోవర లింగేశ్వర స్వాములకు ఘనంగా పూజా కార్యక్రమాలు

- పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**నంద్యాల/రుద్రవరం, ఏప్రిల్ 13 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల కేంద్రం సమీపంలో వెలిసిన శ్రీ వాసాపుర వెంకటేశ్వర, మానస సరోవర లింగేశ్వర స్వాములకు శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి కుంకుమార్చన, ధూప దీప నైవేద్యాలతో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి నంద్యాల జిల్లాలోని పలు మండలాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన వందలాది మంది భక్తులకు దాతలు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కోశాధికారి కానాల ఈడిగ నరసింహులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



# విలువల గురించి మాట్లాడడం కాదు..

- ముందు ఎమ్మెల్యేగా రాజీనామా చేయి
- కడియంకు మందకృష్ణ సవాల్

**వరంగల్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మరోసారి మండిపడ్డారు. మాటిమాటికి విలువల గురించి మాట్లాడే కడియం శ్రీహరిని సూటిగా ప్రశ్నిస్తున్నాను. శ్రీహరికి విలువలు ఉంటే, విలువలతో కూడిన రాజకీయాలు చేయదలచుకుంటే స్టేషన్ ఘన్‌పూర్‌లో ఏ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలిచావో ఆ పదవికి ముందు రాజీనామా చేయాలని మందకృష్ణ డిమాండ్ చేశారు. ఆ తర్వాతనే విలువల గురించి మాట్లాడాలని కడియం శ్రీహరికి మందకృష్ణ సూచించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు ఓటేయొద్దని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 70 లక్షలకు పైగా ఉన్న మా దిగలకు ఒక్క లోక్‌సభ సీటు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఈ నెల 16 వరకు వేచి చూస్తామని, ఆతర్వాత 'గోబ్యాక్ కాంగ్రెస్' నినాదం ఎత్తుకుంటామని స్పష్టం చేశారు. ఆ పార్టీపై రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తామని, తమతో బీసీ, మైనార్టీలు కూడా కలిసి రావాలని కోరారు. వర్గీకరణకు మద్దతు ఇవ్వని కాంగ్రెస్.. మాదిగలకు ఏదో చేస్తుందన్న నమ్మకం లేదని, పార్లమెంట్‌లో తమ గళాన్ని వినిపించేందుకు ఒక్క ఎంపీకి అవకాశం ఇవ్వనప్పుడు ఆ పార్టీకి ఎందుకు ఓట్లేయాలని ప్రశ్నించారు.

## నేడు బిజెపి మేనిఫెస్టో విడుదల

**న్యూఢిల్లీ, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

సంకల్ప పత్ర్ పేరుతో భారతీయ జనతా పార్టీ లోక్ సభ ఎన్నికల కోసం మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేయనుంది. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న మేనిఫెస్టో విడుదల చేయనున్నారు. రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆధ్వర్యంలో మేనిఫెస్టోను సిద్ధం చేశారు. ప్రజల అభిప్రాయాలు సేకరించిన తర్వాత మేనిఫెస్టో తయారు చేసింది ఆ కమిటీ. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఈ సంకల్ప పత్రాన్ని ఆవిష్కరించనున్నారు. మోడీ గ్యారెంటీ, వికసిత భారత్ థీమ్‌తో మేనిఫెస్టోను రూపొందించినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. అభివృద్ధి, దేశ శ్రేయస్సు, యువత, మహిళలు, పేదలు, రైతులే ప్రధాన అజెండాగా దీన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. సంకల్ప పత్రం కోసం దాదాపు 15 లక్షల సూచనలు రాగా.. ఇందులో 4 లక్షలకు పైగా అభిప్రాయాలను ప్రజలు నమో యాప్ ద్వారా తెలియజేశారు. మేనిఫెస్టో కోసం 15 లక్షల సూచనలు బీజేపీకి వచ్చాయి. వాటిలో 4 లక్షల సూచనలు నమో యాప్ ద్వారా, 11 లక్షల సలహాలు వీడియోల రూపంలో వచ్చాయి. 27 మందితో కూడిన బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కో-ఆర్డినేటర్‌గా, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కో-కోఆర్డినేటర్‌గా ఉన్నారు.వాటన్నంటిని పరిశీలించిన కమిటీ మేనిఫెస్టోను రూపొందించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అన్ని రాష్ట్రాలకు చెందిన కీలక హామీలు మేనిఫెస్టోలో ఉండే అవకాశం ఉంది. అభివృద్ధి భారతం లక్ష్యంగా మహిళలు, యువత, పేదలు, రైతుల అభ్యున్నతికి మేనిఫెస్టో భరోసా ఇవ్వనుంది. సాధించగలిగిన హామీలను మాత్రమే ఇవ్వడం, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం మేనిఫెస్టో ప్రధాన ఉద్దేశంగా చెప్పనుంది. కల్చరల్ నేషనలిజంపై దృష్టిసారిస్తూ 2047 నాటికి అభివృద్ధి భారతం సాధిస్తామనేది మోదీ ప్రధాన గ్యారెంటీగా ఉండనుంది. 'సబ్ కా సాథ్ సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో సంకల్ప్ పత్ర ఉటుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ న్యాయ పత్రం పేరుతో మేనిఫెస్టోను విడుదల చేసింది. పంచ న్యాయాలు, 25 గ్యారంటీలను అందులో ప్రకటించింది. ఇక దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరగనుంది. తొలి విడత ఏప్రిల్ 19న ప్రారంభం కాగా.. ఏప్రిల్ 26న రెండో విడత, మే 7, 13, 20, 25, జూన్ 1న పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు రిలీజ్ కానున్నాయి. ఈసారి 400కు పైగా సీట్లు సాధిస్తామని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రతిపక్షాల ఇండియా కూటమి కూడా విజయకేతన ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. మరోవైపు దేశంలో లోక్‌సభ ఎన్నికల హడావుడి ఊపందుకుంది. ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు రకరకాల హామీలు ఇస్తున్నాయి. ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది.

# అమరావతే మన రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. అమరావతి కోసం 29వేల మంది రైతులు 35వేల ఎకరాలు ఇచ్చారు. రాజధానికి కేంద్రం కూడా సహకరించింది. అమరావతిని కూడా హైదరాబాద్‌లా మారుద్దామని ప్రణాళికలు వేశాం. విజయవాడ, గుంటూరుతో కలిపి ఆదర్శ రాజధాని చేయాలనుకున్నాం. ప్రపంచదేశాలన్నీ అమరావతి వైపు చూడాలని ఆలోచించా. సంపద సృష్టించే కేంద్రంగా తయారు చేయాలనుకున్నా. జగన్ వచ్చాక రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మార్చేశారని మండిపడ్డారు. ఉపాధి కోసం యువత పక్క రాష్ట్రాలకు వెళ్తున్నారు. రాజధాని అంటే పెద్దపెద్ద భవనాలు కాదు.. ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం అన్నారు. అమరావతితో మూడు ముక్కలాట ఆడుతూ తమాషాలు చేస్తున్నారు. అమరావతిని ఎవరూ కూడా ఇక్కడి నుంచి కదల్చలేరు. అసాధ్యాన్ని.. సుసాధ్యం చేయడమే తెలుగుదేశం పార్టీ సత్తా. మన రాజధాని అమరావతే. విశాఖపట్నం, కర్నూలును అభివృద్ధి చేస్తాం. గోదావరి జిల్లాలు గర్జిస్తున్నాయి.. ఆ జిల్లాల్లో వైకాపాకు ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు అమరావతి ప్రజల సంబరాలతో పాటు.. జగనాసుర వధ కూడా జరుగుతుంది. జగన్ పోవాలి.. ప్రజలు గెలవాలని అన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆ పార్టీ నేతలకు కమిషన్లు ఇవ్వలేక రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయి. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను మోసం చేశారు. సీపీఎస్ రద్దు చేస్తామన్నారు.. చేశారా?ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు ఇవ్వలేదు. బడికి రంగులు వేస్తే విద్యా వ్యవస్థ మారిపోతుందా? రూ.కోట్లు ఖర్చు పెట్టినా జగన్ సభలకు జనం రావడం లేదు. ఏ ముఖ్యమంత్రి అయినా మంచి పనితో పాలన ప్రారంభిస్తారు. కానీ, రూ. 10కోట్లతో కట్టిన ప్రజావేదిక కూల్చివేసి దుర్మార్గ పాలనకు తెరతీసారు. రాష్ట్రం బాగుపడాలంటే జగన్ దిగిపోవాలి. రాష్ట్ర ప్రజలకు వైకాపాపై కక్ష తీర్చుకునే అవకాశం వచ్చింది. నేను సీఎంగా ఉంటే పోలవరం ఈ పాటికి పూర్తయ్యేది. పోలవరం పూర్తి చేశాక నదుల అనుసంధానం చేద్దామనుకున్నా. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వస్తుంది. జూన్ 4న ఇక్కడ విజయోత్సవాలు చేసుకుందాం. నేను, పవన్, మోదీ కలిసి అమరావతిని అభివృద్ధి చేస్తాం' అని చంద్రబాబు భరోసా కల్పించారు. కేంద్రం అండతో అమరావతిని, ఎపిని అద్భుతంగా తీర్చిదిద్దుతానని అన్నారు.

## కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధిస్తుంది

- ఇండియా కూటమికి మంచి ఫలితాలు వస్తాయి
- కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

**న్యూఢిల్లీ, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో 'ఇండియా' కూటమి అద్భుతమైన విజయాన్ని సాధిస్తుందని సీనియర్ కాంగ్రెస్ నేత పి. చిదంబరం ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చిదంబరం మాట్లాడుతూ.. 'నేను అన్ని రాష్ట్రాల గురించి మాట్లాడలేను. కానీ తమిళనాడులో ఇండియా కూటమి తిరుగులేని విజయాన్ని నమోదు చేస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. కేరళలో యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ ఫ్రంట్ 20 సీట్లను గెలుస్తాయి. అక్కడ బీజేపీ ఒక్కసీటు కూడా గెలవకపోవచ్చు. ఇక కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాదరణ పొందాయి. 2019 కంటే కాంగ్రెస్‌కు ఈసారి ఎక్కువ సీట్లే వస్తాయి' అని చిదంబరం చెప్పుకొచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయావకాశాల గురించి సీనియర్ కాంగ్రెస్ నేత పి. చిదంబరం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ గత లోక్‌సభ ఎన్నికలకంటే ఎక్కువ సీట్లే ఈ ఎన్నికల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ మెరుగైన పనితీరును కనబరుస్తుందని అన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఢిల్లీలో 'ఇండియా' కూటమికి మంచి ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. కాగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 52 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే.

## మంచినీటికి ఢోకా లేదు

- సోషల్ మీడియా వదదంతులు నమ్మొద్దు

**హైదరాబాద్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు ఢోకా లేదని, తగిన మోతాదులో కూడా నీళ్ళు అందిస్తున్నామని వాటర్ బోర్డ్ ఎం. డీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. క్షేత్ర స్థాయిలో నీళ్ళు సరిగ్గా అందించ కుండా జనాలను ఇబ్బంది గురిచేస్తున్న ముగ్గురు లైన్ మెన్ లను సస్పెండ్ చేశామని.. మరో 7 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. సోషల్ మీడియాలో నీళ్ళు లేక సప్లై చెయ్యడం లేదని వదంతులు క్రియేట్ చేస్తున్నారని వాటిని నమ్మొద్దని సూచించారు. వాటర్ ట్యాంకర్లతో రోజుకు 7 వేల ట్రిప్స్ ద్వారా నీళ్ళు అందిస్తున్నామని సుదర్శన్ రెడ్డి చెప్పారు. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల దోపిడీ పై రెవెన్యూ శాఖ దృష్టి సాధించిందని తెలిపారు.

# మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలి

- ఓటు వేసేటప్పడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతాం
- 98శాతం హామీలు విస్మరించడం చంద్రబాబు ట్రాక్ రికార్డ్
- నేతన్నలకు పంగనామం పెట్టిన ఘనుడు బాబు
- చేనేత చెల్లెమ్మ లావణ్యకు మంగళగిరి టిక్కెట్ ఇచ్చా
- చేనేత కార్మికులతో ముఖాముఖిలో జగన్



**మంగళగిరి, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

ఎన్నికల్లో మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలని వైకాపా అధినేత, సిఎం జగన్ పిలుపునిచ్చారు. 98శాతం హామీలు విస్మరించడం చంద్రబాబు ట్రాక్ రికార్డ్ అని జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతామని సూచించారు. జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్ర మంగళగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఎం జగన్ చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..ఇంటి స్థలాలను ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబుని నిలదీయాలన్నారు. ఒక్కరికైనా సెంట్ స్థలం ఇచ్చారా?. మనం స్థలం ఇస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. ఒక్క ఇల్లయినా ఇచ్చారా?. చేనేత కార్మికులకు ఇల్లు, మగ్గం అని చంద్రబాబు మోసం చేశారు. అందుకు భిన్నంగా తాను నేతన్న నేస్తం పథకం కింద రూ.970కోట్లు చేనేత కార్మికులకు అందించాం. మగ్గం ఉన్న ప్రతీ కుటుంబానికి చేయూతనిచ్చిన ప్రభుత్వం మనదన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ది జరిగింది. గతంలో ఎప్పుడైనా ఇలాంటి పథకం అములు చేసిన సందర్భం ఉందా అని ప్రశ్నించారు. . నేతన్నల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.3706 కోట్లు ఖర్చు చేశాం. 1.06లక్షల మందికి లబ్ది జరిగిందన్నారు. గతంలో లంచాలు ఇస్తే కూడా సంక్షేమ పథకం అందని పరిస్థితి ఉండేదన్నారు. దళారులు లేకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాం. నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేసిన ప్రభుత్వం మనది. ఎన్నికల్లో మన బతుకులు మార్చే నాయకుడిని ఎన్నుకోవాలి. 2014 ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చలేదు. వాలంటీర్ వ్యవస్థతో అవ్వాతాతలకు పెన్షన్ అందించిన ప్రభుత్వం మనది. పెన్షన్‌ను రూ.3వేలకు పెంచి అందించే అవకాశం నాకు వచ్చింది. 50 శాతం వెనుకబడిన వర్గాలకు టికెట్ ఇచ్చిన ఘనత మనదే. దేశ రాజకీయ చరిత్రలోనే ఇది ఒక రికార్డు. బీసీలు ఎక్కువగా ఉన్నా.. చంద్రబాబు బీసీలకు సీటు ఇవ్వలేదు. కుప్పంలో కూడా బీసీలే ఎక్కువ.. అక్కడా బీసీలకు టికెట్ ఇవ్వరు. మనం మాత్రం చేనేత వర్గానికి చెందిన చె÷-లలెమ్మెకు టికెట్ ఇచ్చాము. మంగళగిరిలో లక్షా 20వేల ఇళు ్లన్నాయి. లక్షా 8వేల ఇళ్లకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాం. 90 శాతం ఇళ్లకు లంచాలకు తావులేకుండా లబ్ది జరిగింది. నేరుగా వారి ఖాతాల్లోనే నగదు జమ చేసిన ప్రభుత్వం మనదని తెలిపారు. రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్న చంద్రబాబు విషయం జాగ్రత్తగా ఉండాలన్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ వస్తున్న చంద్రబాబు గతంలో చేసిన అన్యాయాన్ని గుర్తుచేసుకోవాలని సూచించారు. గత చంద్రబాబు పాలనను మీరు చూశారు. 58 నెలల కాలంలో మీ బిడ్డ పాలనను చూశారు. ప్రతీ పేదవాడి గుండెల్లో నిలిచేలా మీ బిడ్డ అడుగులు వేశాడు. 58 నెలల పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజల నుంచి వింటున్నాను. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలకు సూచనలు తీసుకుంటున్నాను. చంద్రబాబుకు ఉన్నంత నెగిటివిటీ అనుభవం నాకు లేదన్నారు. చేనేత కార్మికులను కూడా చంద్రబాబు మోసం చేశాడు. 2014లో కూటమిగా వచ్చి చంద్రబాబు ఏం చేప్పారో గుర్తు చేసుకోండి. ఓటు వేసేటప్పుడు అప్రమత్తంగా లేకుంటే మళ్లీ మోసపోతాం. గతంలో 98 శాతం హామీలను ఎగ్గొట్టారు. 2 శాతం హామీలను మాత్రమే నెరవేర్చారు. గత పాలనకు, మన పాలనకు తేడాను మీరే గమనించారు. చంద్రబాబు రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ వస్తున్నారు. గతంలో కూడా ముగ్గురు కలిసే వచ్చారని విమర్శించారు. మంగళగిరిలో చేనేతలు ఎక్కువ.. అందుకే ఆర్కేతో మాట్లాడి చేనేత కుటుంబానికి చెందిన నా చెల్లెమ్మ మురుగుడు లావణ్యకి టికెట్ ఇచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మరో వైపు చంద్రబాబు ఆయన కొడుకు ఏం చేస్తున్నారు. బీసీలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో వాళ్లే నిలబడి కోట్లకి కోట్లు డబ్బు ఖర్చు చేస్తున్నారని అంటూ దుయ్యబట్టారు. కుప్పంలోనూ బీసీలు ఎక్కువగా ఉన్నా అక్కడ కూడా ఇదే పరిస్థితి. తేడా గమనించమని కోరుతున్నానని సీఎం జగన్ తెలిపారు. గత పాలనకు, మన పాలనకు తేడాను మీరే గమనించారు. చంద్రబాబు రంగురంగుల మేనిఫెస్టోతో వస్తున్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ వస్తున్నారు. గతంలో కూడా ముగ్గురు కలిసే వస్తున్నారని సీఎం జగన్ వివరించారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# ముస్లిం మైనార్టీల్లో మార్పు

- కాంగ్రెస్‌కు అనుకూలంగా నిర్ణయాలు
- మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బహిర్గతం

హైదరాబాద్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):

ఆయా రాం గయా రాంల వ్యవహారాలను పక్కనపెడితే తెలంగాణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. అదే ముస్లింల వైఖరిలో వస్తున్న మార్పు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ముస్లింలు కేసీఆర్‌కు అండగా ఉంటూ వచ్చారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి ప్రగతి భవన్ తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉండేవి. అయితే ఇప్పుడు ముస్లింల వైఖరిలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపించింది. ఇందుకు ప్రధాన కారణం బీజేపీని వ్యతిరేకించడమే. కర్ణాటకలోని ముస్లింలు అంతా ఏకతాటిపైకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ వైపు నిలబడ్డారు. ఫలితంగా జేడీఎస్‌కు పరాభవం ఎదురైంది. మిగతా రాష్ట్రాలలో మాదిరి కర్ణాటకలో కూడా ముస్లింల ఓట్ల ఆధారంగా పోటీ చేయాలనుకున్న మజ్లిస్ అధినేత ఒవైసీని కర్ణాటకలోని ముస్లిం మత పెద్దలు ప్రతిఘటించారు. ముస్లిం ఓట్లను చీల్చి బీజేపీకి లబ్ది చేకూర్చే ప్రయత్నాలను సహించబోమని తేల్చి చెప్పారు. దీంతో కర్ణాటక ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేయకుండా ఉండిపోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలను గమనించిన తెలంగాణలోని ముస్లింలు కూడా జాతీయ స్థాయిలోగానీ, రాష్ట్ర స్థాయిలోగానీ కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్న అభిప్రాయానికి వచ్చినట్టు వివిధ పరిశీలనల్లో వెల్లడైంది. దీనికితోడు బీజేపీతో భారతరాష్ట్ర సమితి లోపాయికారీ అవగాహన కుదుర్చుకుందన్న అభిప్రాయం బలపడుతుండటం తో ముస్లిం మైనారిటీలు కాంగ్రెస్‌కు అనుకూల నిర్ణయం తీసుకున్నారు. ముస్లిం మైనారిటీల్లో వస్తున్న ఈ మార్పును బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కూడా గమనిస్తున్నారు. తమ సర్వేలలో కూడా ఈ విషయం స్పష్టమవుతోందని వారు అంగీకరిస్తున్నారు. భారతీయ జనతా పార్టీతో లోపాయికారీ ఒప్పందం కుదిరిందన్న ప్రచారం తమ కొంప ముంచచిందని ఆందోళన చెందుతున్నారు. ముస్లింలలో వస్తున్న ఈ మార్పు అక్కడితో ఆగకుండా క్రైస్తవులకు కూడా విస్తరిస్తుందని బీఆర్ఎస్ ముఖ్యులు భయపడుతున్నారు. 2014, 2018 ఎన్నికల్లో తమకు అండగా ఉన్న ఈ రెండు వర్గాలూ దూరం కావడం వల్లనే అధికారం కోల్పోయామని అంగీకరించారు. ఈ పరిణామాలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతున్నాయి. ప్రస్తుతానికి ఊపు మీద ఉన్న కాంగ్రెస్ పార్టీని అదను చూసి దెబ్బకొట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కొన్ని అస్త్రాలను సిద్ధం చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లో వస్తున్న మార్పును గమనిస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం భరోసాగా ఉన్నారు. గ్రామాల్లో తమ పార్టీ బలంగా ఉందని ఇప్పటిదాకా భావించామని, ఇప్పుడు తాము చేయించుకుంటున్న సర్వేలలో ఆ పరిస్థితి లేదని, గ్రామాలలో కూడా వ్యతిరేకత పెరుగుతున్నట్టు స్పష్టమవుతోందని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కారణాలు ఏమైనా కేసీఆర్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత నెలకొన్నదన్న మాట నిజం. రాజకీయ వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ రాష్ట్ర కాంగ్రెస్‌లో గొడవలు ఏర్పడకుండా కాంగ్రెస్ కూడా కఠినంగానే ఉంటోంది. సోనియాగాంధీ ప్రత్యేకంగా దృష్టి సారించడంతోపాటు రాహుల్ గాంధీ,ప్రియాంకా గాంధీలకు తగిన సూచనలు చేస్తున్నారు. తెలంగాణలో పరిస్థితులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతున్నందున అందరితో సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకు వెళ్లగలిగితే పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం సాధించగలమని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తరవాత కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకొంటున్నది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పెద్దల వ్యూహాలు ఏ విధంగా ఉండబోతున్నాయో చూడాలి. సీమాంధ్రులు, ముఖ్యంగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మొన్నటి ఎన్నికల్లో బిఆర్ఎస్ వెంట నడిచారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్, భూ దందాలు బయటపడుతున్నాయి. ఈ క్రమంలో పలు స్థానాలలో గెలుపోటములను ప్రభావితం చేయగలరు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఆ వర్గం ఏ వైఖరి తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. కమ్యూనిస్టులు కూడా కాంగ్రెస్ వెంటే ఉండడంతో విజయం సునాయాసం అవుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే బిజెపి ఎలా ఢీకొంటారన్నదే ముఖ్యం.

# షకీల్ కొడుకు రాహిల్‌కు బెయిల్

- నాటి పోలీసుల తీరుపై దర్యాప్తు

హైదరాబాద్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):

మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. రాహిల్‌కు మంజూరు చేసింది. అయితే, రాహిల్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో జూబ్లీహిల్స్‌లో 2022లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసును కూడా రీ ఓపెన్ చేయనున్నారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అప్పటి పోలీసు అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పంజాగుట్ట కేసుమాదిరిగానే.. జూబ్లీహిల్స్ కేసులోనూ రాహిల్‌ను తప్పించారు అప్పటి పోలీసులు. తనకు బదులుగా వేరే వ్యక్తిని డ్రైవర్‌గా పంపించాడు రాహిల్. ఇప్పటికే ఈ కేసులో చార్జిషీట్ సైతం దాఖలు చేశారు పోలీసులు. చార్జిషీట్లోనూ రాహిల్‌ను తప్పించే ప్రయత్నం చేశారు అప్పటి జూబ్లీహిల్స్ పోలీసులు. 2022 మార్చ్‌లో జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో కారు ప్రమాదం జరిగింది. ఈ ఘోర ప్రమాదంలో నెలల వయసున్న చిన్నారి ప్రాణాలు కోల్పోగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు రీ ఓపెన్ చేశాక బాధితుల స్టేట్‌మెంట్‌ను పోలీసులు మరోసారి రికార్డ్ చేశారు. ఈ కేసు విచారణలో రాహిలే ప్రమాదానికి కారణం అని తేల్చారు. అయితే, జూబ్లీహిల్స్ కేసులో రాహిల్‌ను తప్పించిన అప్పటి పోలీసులపై చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మరి పోలీసులు ఈ వ్యవహారంలో ఎలాంటి స్టెప్ తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# బిఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లే

ప్రచారంలో కిషన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):

బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే, అది మూసీ నదిలో వేసినట్టేనని కేంద్రమంత్రి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ అవినీతికి కేంద్రంగా మారడంతో ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. కుటుంబ పాలనకు బిజెపి వ్యతిరేకమని అన్నారు.శనివారం గుడిమల్కాపూర్ నుంచి మెహిదీపట్నం, పద్మనాభనగర్‌లో బైక్‌ర్యాలీ రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి నరేంద్రమోదీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశ ప్రజల కోసం అహర్నిషలు కష్టపడుతున్న మహోన్నతమైన వ్యక్తి నరేంద్రమోదీ అని ఆయన కొనియాడారు. నాంపల్లి నియోజకవర్గంలో ఓట్లు చీలకుండా మనమంతా ఐక్యంగా ఉండి బీజేపీని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి అన్నపురం రమేశ్‌కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాహుల్‌చంద్ర, డివిజన్ అధ్యక్షులు ముఖేశ్, జనార్ధన్‌రావు, విజయ్, బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర తదితరులు ఉన్నారు.



# ధాన్యం సేకరణలో శ్రద్ధలేని సీఎం రేవంత్

- తెలంగాణలో రూ. 1450 కోట్ల వడ్ల కుంభకోణం
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన సేకరణ మీద ఉన్నంత ధ్యాస.. ధాన్యం సేకరణ మీద లేదు అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. రూ. 1450 కోట్ల వడ్ల కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఐఎన్‌సీ అంటే ఇండియన్ నేషనల్ కరప్షన్ పార్టీ అని జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డిది స్కీమ్‌ల పాలన కాదు అని స్కామ్‌ల పాలన అని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 7,429 కొనుగోలు కేంద్రాలు పెడితే.. ఇప్పుడు రేవంత్ రెడ్డి 5 వేల దాకా మాత్రమే పెట్టారు. దీంతో రైతులు ఆగమై పోతున్నారు. ధన సేకరణ మీద పెట్టిన దృష్టి ధాన్యం సేకరణ మీద కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టడం లేదు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ. ఫాదర్ ఆఫ్ ద కరప్షన్ పార్టీ ఏదంటే అది కాంగ్రెస్ పార్టీనే అని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి 420 స్కీములు డిసెంబర్ 9 కే ఇస్తామని చెప్పి డైవర్ట్ చేస్తున్నాడు. ఇప్పుడు ఇంకో 25 పథకాలు ఇస్తామని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ పథకాలు మరిచిపోయేలా రేవంత్ చేష్టలు ఉన్నాయి. రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి పేరిట ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో 1450 కోట్ల వడ్ల కుంభకోణం జరిగింది. 35 లక్షల మెట్రిక్ టన్నులు అమ్ముకున్నారు. రూ. 2183 మద్దతు ధర ఉంటే రూ. 1900 కే అమ్మారు. ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు అమ్మారు. ఈ గ్లోబల్ టెండర్లు ఆంధ్రవాళ్లకు వచ్చినయి. ఈ గ్లోబల్ టెండర్లలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల వాటా ఎంతో చెప్పాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ వడ్ల స్కామ్ మీద సీబీఐ, ఈడీ సుమోటోగా కేసు నమోదు చేసి ఎంక్వయిరీ వేయాలన్నారు జీవన్ రెడ్డి. దీని మీద మేం కూడా సీబీఐ ,ఈడీకి లెటర్ రాస్తామన్నారు. బీజేపీ కూడా దీని మీద నోరు మెదపడం లేదు బీజేపీ వాళ్ళ వాటా కూడా ఎంతో చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఊరిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వడ్లు కొన్నాం. కానీ రేవంత్ రెడ్డి రౌడీయిజం చేస్తున్నారు. ఈ రాష్ట్రంలో, దేశంలో అప్రకటిత ఎమ్జర్జ÷న్సీ కొనసాగుతోంది. హస్తం అంటే అవినీతి నేస్తం అని జీవన్ రెడ్డి మండిపడ్డారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విరుచుకుపడ్డారు. రంజిత్ రెడ్డి చప్రాసీ ఉద్యోగానికి కూడా పనికిరాడు అని తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రంజిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఏం తక్కువ చేసింది. కోళ్లు, గుడ్లు అమ్ముకునే రంజిత్ రెడ్డిని తీసుకొచ్చి ఎంపీని చేశారు కేసీఆర్. ఆయన జీవితంలో చప్రాసీ కూడా కాలేదు. ఆ ఉద్యోగానికి కూడా పనికిరాడు. నువ్వే నా గురువు, నువ్వే నా ఫాదర్ అని రోజు కేసీఆర్‌కు చెప్పేవాడు. నా కన్న తండ్రి కంటే కేసీఆరే గొప్ప అని చెప్పాడు. అక్రమాస్తులను కాపాడుకునేందుకే రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. విశ్వాస ఘాతకుడు రంజిత్ రెడ్డి. ఈయన డాక్టర్ రంజిత్ రెడ్డి కాదు.. కోళ్లకు సూదులిచ్చే డాక్టర్ రంజిత్ రెడ్డి. కోళ్ల దాణా అమ్మి.. 300 ఎకరాల భూములు గుంజుకున్నాడు. చాలా మందిని మోసం చేసిండు.. ఆ జాబితా కూడా త్వరలోనే బయటపెడుతాను. చేవేళ్ల ఆయన ఊరు కాదు. కరీంనగర్‌లో పుట్టిండు.. వరంగల్‌లో బతికిండు. హైదరాబాద్‌లో కోళ్ల దుకాణం పెట్టాడు. ఆయనకున్న ఆస్తులను అఫిడవిట్‌లో పొందుపరచలేదు. కేసులు పెడుతారని భయపడి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఇవాళ ఎలాగైతే కేసీఆర్‌ను మోసం చేసిండో.. రేపు రేవంత్‌ను కూడా అలాగే మోసం చేస్తాడు అని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు.

## తీహార్ జైలులో కేజ్రీవాల్‌కు వేధింపులు

- ఆప్ ఎంపి సంజయ్ సింగ్ ఆరోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):

తీహార్ జైల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌ను వేధిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం సూచనల ఆధారంగా కేజ్రీవాల్‌కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. శనివారం ఉదయం ఢిల్లీలో సంజయ్ సింగ్ ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి మాట్లాడారు. జైలు మాన్యువల్ ప్రకారం.. ములాఖత్‌కు వచ్చిన వారిని జైల్లో ఉన్న వ్యక్తి ముఖాముఖి కలుసుకునేందుకు తీహార్ జైలు పరిపాలనా యంత్రాంగం అనుమతి ఇచ్చిందని, కానీ కేజ్రీవాల్ విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నారని సంజయ్ సింగ్ ఆరోపించారు.

## ఖాళీ స్థలంపై మహిళతో ఘర్షణ

- మహిళను మంటల్లోకి నెట్టిన వైసిపి నేత

విశాఖపట్టణం, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):

ఖాళీ స్థలం విషయంలో వైసిపి నాయకుడికి, స్థానిక మహిళకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వైసిపి నేత సదరు మహిళను మంటల్లోకి నెట్టేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. ఈ ఘటన విశాఖ గాజువాకలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాజువాక 65వ వార్డు బానోజితోటలో రాధ (35) నివాసం ఉంటోంది. ఆమె ఇంటి పక్కన కొంత ఖాళీ స్థలం ఉండగా.. శుక్రవారం వైసిపి నాయకుడు లోకనాథం అక్కడ చెట్లు నరికి అగ్గి పెట్టాడు. దీంతో రాధ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ స్థలం తనదని.. ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ అతడిని నిలదీసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో లోకనాథం ఆమెపై చేయి చేసుకున్నాడు. చెట్టు కాలుతున్న మంటల్లోకి తోసేయడంతో ఆమె చేతులు, ముఖానికి గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితురాలు న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం రాధ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. మరోవైపు లోకనాథం తాను ఆ సమయంలో సంఘటనా స్థలంలో లేనని చెబుతున్నాడు. కొద్దిరోజులుగా ఆమె తనపై కక్ష పెట్టుకుని ఫిర్యాదు చేస్తోందని ఆరోపించాడు. దీనిపై సీఐను సంప్రదించగా.. ఫిర్యాదు అందిందని, విచారణ చేపట్టినట్లు చెప్పారు. ఖాళీ స్థలంపై గత కొన్నాళ్లుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం.

# తిరుమల పవిత్రతను మంటగలిపిన ప్రభుత్వం

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సరిదిద్దుతాం
- తిరుపతి నాయకులతో పవన్ ఆవేదన

అమరావతి, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):

తిరుమల క్షేత్ర పవిత్రతను అధికార వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, కోరి తెచ్చుకున్న అధికారులు మంటగలిపేసిన తీరు భక్తులను మనోవేదనకు గురి చేసిందని, కూటమి ప్రభుత్వంలో కచ్చితంగా ధర్మ పరిరక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులను సైతం అడ్డగోలుగా వాడుకునే కుట్రలకు అధికార పార్టీ నాయకులు తెర తీసిన విషయంపై సమగ్ర సమాచారం పార్టీ దగ్గర ఉందన్నారు. తిరుపతిలో బీజేపీ నేతలతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు అనుసరించాలని వ్యూహాలు, తిరుపతి అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు ఆయనను కలిశారు. జనసేన పార్టీ శ్రేణులు, నాయకులకు దిశానిర్దేశర చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీ చేసిన అక్రమాలు, దౌర్జన్యాలను ఈసారి సార్వత్రిక ఎన్నికల్లోనూ చేస్తుందని.. దాన్ని మూడు పార్టీలూ సమర్ధవంతంగా ఎదుర్కోవడంపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఇంతకు ముందు సైతం చర్చల్లో బోగస్, దొంగ ఓట్లుపై చర్చ జరిగిందన్నారు. దీనిపై కచ్చితంగా కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. బూత్ స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు అప్రమత్తంగా వ్యవహరించి దొంగ ఓట్లను అడ్డుకోవడం అత్యవసరమన్నారు. ఈ విషయంలో మూడు పార్టీలు ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పని చేయాలన్నారు. తులసి వనం లాంటి తిరుపతిని గంజాయి వనం చేసేసిన వైఎస్సార్‌సీపీని సాగనంపాల్సిన సమయం వచ్చేసిందని.. ఇదే పరిస్థితి రాష్ట్రం అంతటా ఉందన్నారు. అరాచకాలను, అవినీతికి, గూండాయిజానికీ ప్రతివర్గం నలిగిపోయిందన్నారు. రైతులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, పెన్షనర్లు, వృద్ధులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇలా ప్రతి వర్గం వైఎస్సార్‌సీపీతో బాధలు పడుతోందని.. పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలు బెంబేలెత్తిపోయారన్నారు. రాబోయేది కూటమి ప్రభుత్వమే. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని బలంగా ఎదుర్కోగలిగేది కూటమి పార్టీలేనని ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆదివారం । ఏప్రిల్ । 14 । 2024



# తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందా ?

- పొత్తులో భాగంగా బిజెపికి మద్దతుగా నిలుస్తుందా
- తెలంగాణ జనసేన నేతల్లో కానరాని స్పష్టత

**విజయవాడ, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

ఎపిలో పొత్తులో ఉన్న జనసేన తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తుందా లేకపోతే...బిజెపికి మద్దుతగా నిలుస్తుందా అన్నది తెలియాల్సి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసి బొక్కబోర్లా పడింది. తెలంగాణ లోక్ సభ ఎన్నికలకు సంబంధించి జనసేనాని పవన్ కళ్యాణ్ సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఏపీలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిగా ఎన్నికల బరిలో దిగుతున్నాయి. పొత్తులో భాగంగా జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోంది. అయితే జనసేన టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పి వైసీపీలోకి క్యూ కట్టారు. జనసేన నేతలకు టికెట్లు ఇవ్వలేదనే బాధ కంటే కూడా.. పక్క పార్టీల నుంచి పిలిచి మరి టికెట్ ఇవ్వడంపై మండిపడుతున్నారు. ఇప్పటికే పోతిన మహేష్, మనుక్రాంత్ రెడ్డి, పితాని బాలకృష్ణ, పాముల రాజేశ్వరి సహా పలువురు నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పారు. మరికొందరు అదే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వరుసగా నేతలు పార్టీని వీడుతుండడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ అలర్టయ్యారు. మొన్నటి వరకు అసంతృప్తులపై కన్నెత్తి కూడా చూడని పవన్ కల్యాణ్ ఇప్పుడు వారిని బుజ్జగించే పనిలో పడ్డారు. టికెట్లు దక్కని సీనియర్లలో కొంతమందికి జిల్లా ఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు అప్పగిస్తూ.. మరికొంతమందికి పార్టీ ఏర్పాటు చేసిన కమిటీలో అవకాశాలు ఇచ్చి వారిని బుజ్జగిస్తున్నారు. తిరుపతి టికెట్ అరణి శ్రీనివాసులుకు కేటాయించడంతో జనసేనలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. జనసేన తిరుపతి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న కిరణ్ రాయల్ సీటు ఆశించారు. కానీ వైసీపీ నుంచి వచ్చిన అరణి శ్రీనివాసులుకి టికెట్ కేటాయించడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికే ప్రచారంలో శ్రీనివాసులకి అటు జనసేన నుంచి, ఇటు టీడీపీ నుంచి సహకారం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో తిరుపతి వెళ్లిన పవన్ కల్యాణ్ కూటమి నేతలతో సమావేశమయ్యారు. టీడీపీ అసమ్మతి నేతలతోనూ పవన్ మాట్లాడారు. తిరుపతి జనసేన అభ్యర్థిపై నిర్ణయం చంద్రబాబుతో కలిసి తీసుకున్నామని వారికి వివరించారు. జనసేన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల కోసం సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు పవన్ కల్యాణ్. బొంగునూరి మహేందర్‌రెడ్డి సమన్వయకర్తగా, శంకర్‌గౌడ్, రాజలింగం, పొన్నూరి శిరీష, ప్రేమ్‌కుమార్, ములుకుంట్ల సాగర్ సభ్యులుగా ఉంటారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో భాగంగా 7 స్థానాల్లో పోటీ చేసిన జనసేన ఆశించినంతమేర సక్సెస్ కాలేదు. మరి లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి తెలంగాణలో ఖాతా ఓపెన్ చేస్తుందా అనేది వేచి చూడాలి. అయితే ఇప్పటి వరకు 17 లోక్ సభ స్థానాలకుగాను ఒక్క నియోజకవర్గానికి కూడా అభ్యర్థులను ప్రకటించలేదు జనసేన. అయితే నామినేషన్ ప్రక్రియకు కేవలం ఐదు రోజుల ముందు ఈ సమావేశం ఏర్పాటు చేయడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రత్యక్షంగా పోటీ చేస్తారా లేక గతంలో లాగా ఇతర పార్టీలకు మద్దతు ఇస్తారా అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# వరంగల్ లోక్‌సభలో రసవత్తర పోటీ

- రంగంలో ముగ్గురూ బిఆర్ఎస్ పాతకాపులే
- కాంగ్రెస్, బిజెపిలలో బిఆర్ఎస్ జంపింగ్‌లు
- పూర్తిగా చీలనున్న బిఆర్ఎస్ ఓట్ బ్యాంక్

**వరంగల్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

వరంగల్ లోక్‌సభకు ఎవరెవరు పోటీ చేస్తారన్న స్పష్టత వచ్చింది. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. మొత్తంగా మూడు పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. అయితే పోటీ చేస్తున్న ముగ్గురూ బిఆర్ఎస్‌కు చ ఎందిన వారే కావడం గమనార్హం. కడియం కావ్య తొలుత బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపికయ్యారు. ఆమె పార్టీని వీడడంతో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యా ఆరూరు రమేశ్‌ను ఎంపిక చేయాలని బిఆర్ఎస్ భావించింది. ఆయన కూడా బిఆర్ఎస్‌ను వీడి బిజెపి టిక్కెట్‌తో బరిలోకి దిగారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా వాసి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధీర్‌కుమార్‌ను కెసిఆర్ ఎంపిక చేశారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిషత్తు చైర్మన్‌గా ఆయన కొనసాగుతున్నారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీకి విధేయుడిగా, అధినేతతో కలిసి పనిచేస్తున్న సుధీర్‌కుమార్ సరైన అభ్యర్థిగా ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ముఖ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు అందరితో చర్చించి వారి సలహాలు, సూచనల మేరకు అధినేత కేసీఆర్ సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. అంతకుముందు వరంగల్ లోక్‌సభ పరిధిలోని పార్టీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అన్వేషణ సాగిస్తోంది. కాంగ్రెస్, బీజేపీలక దీటుగా నిలబడే బలమైన అభ్యర్థి కావాలంటూ అధిష్ఠానం ఆశావహుల జాబితాను వడపోసింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా తొలుత కడియం కావ్య పేరును అధిష్ఠానం ఖరారు చేసినా.. అనూహ్యంగా ఆమె బీఆర్ఎ కు రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగటంతో గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. దీంతో వరంగల్ ఓటర్లలో గట్టి పట్టున్న నేతను బరిలో దించాలని ఆ పార్టీ సుధీర్ వైపు మొగ్గు చూపింది. ఇప్పుడు ముగ్గురూ బిఆర్ఎస్ మూలాలున్న అబ్యర్థులు కావడంతో బిఆర్ఎస్ ఓట్లు చీలుతాయన్న బెంగ ఉంది. అలాగే పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవవారికి టిక్కెట్ ఇవ్వలేదని కాంగ్రెస్, బిజెపిల్లో చర్చ నడుస్తోంది. తమకు అన్యాయం చేసి ఇతర పార్టీల అభ్యర్థలను తెచ్చుకున్నారన్న విమర్శలు కూడా రెండు పార్టీల్లో ఉన్నాయి. ఈ క్రమంలో కడియం కావ్య గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు ఏమాత్రం కృషి చేస్తాయన్నది చూడాలి. అలాగే ఆరూరికి కూడా బిజెపి శ్రేణులు సహకరిస్తాయా అన్న చర్చ కూడా సాగుతోంది. వరంగల్ రాజకీయాలు చూస్తే అవుననే అనిపిస్తున్నాయి. కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇవ్వడాన్ని ఆ పార్టీ శ్రేణులు, ఆశావహులు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. కడియం శ్రీహరి తన కూతురు విజయం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు శ్రేణులు కావ్య బరిలో ఉండడాన్ని అంగీకరించడం లేదు. కడియం శ్రీహరి ఆయన కూతురు కాంగ్రెస్ లో చేరడంతో పాటు టికెట్ కేటాయించడంపై ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ లో అసంతృప్తి కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు కడియం శ్రీహరిని మనస్ఫూర్తి గా అంగీకరించడంలేదన్న విమర్శలు ఉన్నాయి. కడియం కావ్య విజయం కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్టాన పెద్దలు చెబుతున్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాని, విజయం సాధిస్తేనే మనుగడ ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అలాగే బిజెపి కూడా ఇలాంటి సందేశాన్నే పంపుతోంది. ఇకపోతే కడియం కావ్య అభ్యర్థిత్వం ఖరారైన నాటి నుండి ఆశావాహులు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. వరంగల్ పార్లమెంటు టికెట్ కోసం పదుల సంఖ్యలో పోటీ పడ్డ ప్రధానంగా ఐదుగురు పేర్లు వినిపించాయి. ఎప్పుడైతే కడియం కావ్యకు టికెట్ ఖరారు కావడంతో ఆశావాహులంతా ఒక్కసారి అసంతృప్తి గురై పార్టీకి దూరంగా ఉంటున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని రెండు రోజుల ముందు వచ్చిన వారికి టిక్కెట్ ఇవ్వడం ఏమిటని ముఖ్య నేతల వద్ద ఆవేదనను వెళ్లగక్కారు. మరోవైపు కడియం శ్రీహరి తన కూతుర్ని వెంటవేసుకొని మండల, నియోజకవర్గ కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో కార్యకర్తల, ద్వితీయ శ్రేణి నేతల అసంతృప్తి బయట పడుతూనే ఉంది. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు కడియం చేరికపై అసంతృప్తితో ఉన్నా అధిష్టానం నిర్ణయం కావడంతో తప్పని పరిస్థితిలో కలసి నడుస్తున్నారు. అంతేకాకుండా బీజేపీ, బీఆర్ఎస్ లకు కడియం శ్రీహరి టార్గెట్ గా మారారు. ఎందుకంటే బిజెపి నుండి పోటీ చేస్తున్న అభ్యర్థి ఆరూరి రమేష్ కడియం శ్రీహరి వల్లనే నాకు బిఆర్ఎస్ లో అన్యాయం జరిగిందని కోపంతో ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్ కు మోసం చేసి కడియం పార్టీ నుండి వెళ్లిపోయారని బీఆర్ఎస్ సైతం కడియంను టార్గెట్ చేసింది. రెండు పార్టీలకు కడియం ఓటమి లక్ష్యంగా మారింది. ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో ఈ మూడు పార్టీల్లో ఎవరు ఎవరిని వెన్నుపోటు పొడుస్తారన్న చర్చ సాగుతోంది.

# దళిత జనోద్ధరణకు రామానుజుల శ్రీకారం

- సంస్కరణ వాది ఆచార్య రామానుజులు
- ఆళ్వారుల్లో దళితలకు పెద్దపీట



**హైదరాబాద్, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**

ఇటీవల హైదరాబాద్ ముచ్చింతల్‌లో సమతామూర్తి రామానుజల విగ్రహావిష్కరణతో ఆయన గొప్పతనమేంటో ప్రపంచానికి తెలిసే అవకాశం వచ్చింది. నిజానికి తమిళనాట అప్పట్లో కులాచారాలు బలంగా ఉండేవి. ఆ కాలంలోనే దళితజనోద్ధరణకు రామానుజులు విశేషంగా కృషి చేశారు. చాపకూడు సహా దళితులను ఆళ్వారులుగా స్వీకరించి వారికి మంత్రోపదేశం ఇచ్చారు. అలా చేరిన వారిలో అగ్రగణ్యులు దళితులే. ఇలా రామానుజా చార్యుల వారు ఆనాడే సంఘసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఎప్పుడూ విభిన్నంగా ఆలోచించే ఆయన ఓ రకంగా సంస్కరణ వాది. ఆనాడే అస్పృశ్యతను వ్యతిరేకించారు. ఆయన నిర్మించిన ఆచార్య పరంపరలో దళితులుకూడా ఉన్నారు. చాపకూడు అంటే సహపంక్తి భోజనాన్ని ఆనాడే ఏర్పాటు చేసి ఆచరించి చూపారు. నేర్చుకోవాలన్న తపన ఉన్నవారు ఎవరైనా కులాలకు అతీతంగా ఆహ్వానించారు. అలా వచ్చిన వారు ఎందరో ఆయన శిష్యగణంగా ఉండిపోయారు. ఆకాలంలో ఆడవారికి, బ్రాహ్మణేతరులకి ఉపదేశం అనేదే లేదు. విలువైన మంత్రాలను ఇతరకుల ఉపదేశించకుండా ఉంటే, విలువైనవి మన వద్ద ఉండి కూడా నష్టం ఎందుకు పొందాలి అని రామానుజాచార్యుల వారు ఆనాడే ఆలోచన చేశారు. రుచి ఉన్న వారికి, మేము కూడా బాగుపడతాం, నాకూ తెల్సుకోవాలని ఉంది అనే వారందరికీ అందించాలి అని ఆచార్య పరంపర ఏర్పాటు చేసారు. అలా ఆయన సంస్కరణలకు శ్రీకరాం చుట్టారు. తనవరకు తీసుకుంటే సుమారు 40 సంవత్సరాలు దాటి, సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన జ్ఞాని అయి ఉన్నప్పటికీ చరమ శ్లోకలో ఉన్న గంభీరమైన తాత్పర్యాన్ని తెలుసుకోవడానికి 300 మైళ్ల దూరంలో ఉన్న ఆచార్యుడి వద్దకి నడిచి 18 సార్లు వెళ్తే కానీ అవకాశం లభించలేదు. నాలాంటికే అంత కష్టంగా లభిస్తే సామాన్యులకు మంత్ర ఉపదేశం జరిగే ప్రశ్నే రాదు. అందుకే రామానుజాచార్యుల వారు ఇంత కష్టంగా ఉన్నా మనకే లభించకపోతే మనకు జరిగే నష్టం ఏంతో కదా అని ఆలోచన చేశారు. అట్లా అష్టాక్షరీ, ద్వయ మంత్రం, చరమ శ్లోకాన్ని ఒకేసారి ఉపదేశంగా అందేట్టు చేసారు. రామానుజులకు ముందు ఈ మూడు మంత్రాలు ఒకే సారి ఉపదేశం చేసేవారే కాదు. మంత్రం, మంత్రార్థం కూడా ఒకేసారి లభించేది కాదు. మరిలా అందరికీ చెబితే దాని విలువ పోదా అంటే, మనిషికి ఒకసారి అంటూ సంస్కారం ఏర్పడితే, లోన నిలిచి పోతుంది, క్రమేపి మనపై ప్రభావం చూపుతుంది. మానవ దేహం అనేది సులభంగా లభించలేదు. ఎన్నో జన్మల క్లేషాల తర్వాత వచ్చింది. ఈ మానవ శరీరం అనేది మెరుపు తీగ పాటి అంత కూడా లేదు అని చెబుతారు అళ్వార్లు. అందుకే సంస్కారం అంటూ ఎర్పడితే మానవ జన్మ కంటే క్రిందకి దిగజార కుండా ఉంటుంది. క్రమేపి బాగుపడే అవకాశం ఉందన్నది రామానుజాచార్యులవారు. ఆశించారు. అది మన పరంపర. రామానుజాచార్యుల నిర్హేతుక కృప వల్ల మనం ఈనాడు ఆ పరంపరని అనుభవిస్తున్నాం.

# ఐపిఎల్‌లో సంచలన విజయాలు నమోదు

- ఛేజింగ్‌లో భారీ స్కోరును ఊఫ్ మనేస్తున్న బ్యాటర్లు
- మొన్న గుజరాత్...నిన్న ఢిల్లీ జట్ల విజయం



**న్యూఢిల్లీ, ఏప్రిల్13(పీపుల్స్ మోటివవేషన్):**



ఐపీఎల్‌లో సంచలనాలు నమోదవుతున్నాయి. ఎంతటి స్కోరును అయినా సునాయాసంగా ఛేజింగ్ చేస్తున్నారు. మొన్నటికి మొన్న గుజరాత్ టైటాన్స్, శుక్రవారం రాత్రి న్యూఢిల్లీ జట్లు ఛేజింగ్‌లో అవలీలగా గెలుపొందారు. దాదాపు 200కు చేరువలో స్కోరు ఉన్నా ఊఫ్‌మనిపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మ్యాచ్ చూసిన వారికి ఇదే విషయం అవగతం అవుతుంది. ఛేజింగ్ చేసే వారు గెలవడం ఖాయమన్నరీతిలో ఐపిఎల్ సాగుతోంది. లక్నో సూపర్ జెయింట్స్ కు ఢిల్లీ దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. వరుసగా మూడు విజయాలతో మంచి ఊపు మీదున్న లక్నోకు పంత్ సేన ఝులక్ ఇచ్చింది. తొలుత బంతితో లక్నోను తక్కువ పరుగులకే కట్టడి చేసిన ఢిల్లీ... తర్వాత మరో 11 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉన్న ఢిల్లీ ఇచ్చిన షాక్‌తో.. లక్నో విజయాలకు బ్రేక్ పడింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ మరో 11 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లక్నోను ఢిల్లీ బౌలర్లు కట్టడి చేశారు. ఆరంభంలో లక్నో ఓపెనర్లు ధాటిగానే ఆడారు. 3 ఓవర్లలో 28 పరుగులు జోడించారు. క్వింటన్ డికాక్‌ను అవుట్ చేసి లక్నో పతనాన్ని ఖలీల్ అహ్మద్ ఆరంభించాడు. 13 బంతుల్లో నాలుగు ఫోర్లతో 19 పరుగులు చేసి డికాక్ అవుటయ్యాడు. దేవదత్ పడిక్కల్‌ను కూడా ఖలీల్ అహ్మద్ అవుట్ చేయడంతో 41 పరుగులకే లక్నో రెండు వికెట్లు కోల్పోయింది. డికాక్, పడిక్కల్ అవుటైనా క్రీజులో ఉన్నంతసేపు లక్నో సారధి రాహుల్ ధాటిగానే ఆడాడు. 22 బంతుల్లో అయిదు ఫోర్లు, ఒక సిక్సుతో 39 పరుగులు చేసిన రాహుల్‌ను... కుల్‌దీప్ యాదవ్ అవుట్ చేశాడు. ఆ తర్వాత స్టోయినీస్ ఎనిమిది, నికోలస్ పూరన్ సున్నా... దీపక్ హుడా పది పరుగులు చేసి వెంటవెంటనే అవుటయ్యారు. ఒకే ఓవర్లో స్టోయినిస్, పూరన్‌ను అవుట్ చేసిన కుల్‌దీప్ యాదవ్ లక్నోను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. నపూరన్‌ను అద్భుత బంతితో బౌల్డ్ చేసిన బంతిని చూసి తీరాల్సిందే. వరుసగా వికెట్లు పడుతున్నా లక్నో బ్యాటర్ ఆయుష్ బదోని లక్నోను ఆదుకున్నాడు. ఆరంభంలో ఆచితూచి ఆడిన బదోని అర్ధ శతకంతో లక్నోకు పోరాడే స్కోరును అందించాడు. 35 బంతుల్లో అయిదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో బదోని 55 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివర్లో అర్షద్‌ఖాన్ 16 బంతుల్లో 2 ఫోర్లతో 20 పరుగులు చేశాడు. బదోని పోరాటంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. 168 పరుగుల లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన ఢిల్లీకి పర్వాలేదనిపించే ఆరంభం దక్కింది. తొలి వికెట్‌కు... పృథ్వీ షా–వార్నర్ 23 పరుగుల జోడించారు. ఎనిమిది పరుగులు చేసిన వార్నర్‌ను యశ్ ఠాకూర్ బౌల్డ్ చేసి లక్నోకు బ్రేక్ ఇచ్చాడు. కానీ పృథ్వీ షా, జేక్ ఫ్రెసర్ మెక్‌గర్క్ ఢిల్లీని విజయం దిశగా నడిపించారు. రవి బిష్ణోయ్ వేసిన ఏడో ఓవర్‌లో 32 పరుగులు చేసిన పృథ్వీ ఔటయ్యాడు. పృథ్వీ అవుటైనా మెక్‌గర్క్ ధాటిగా ఆడాడు. 13వ ఓవర్‌లో వరుసగా మూడు సిక్సులు కొట్టి మ్యాచ్‌ను ఢిల్లీ వైపునకు తిప్పేశాడు. కేవలం 35 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులతో మెక్‌గర్క్ 55 పరుగులు చేసి నవీన్ ఉల్ హక్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. రిషబ్ పంత్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులతో 41 పరుగులు చేసి అవుటయ్యాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఢిల్లీ వైపు పయనించింది. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో అవుటైనా అప్పటికే లక్ష్యం కరిగిపోయింది. స్టబ్స్, హోప్స్ మిగిలిన పనిని పూర్తి చేశారు.

# జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం

- పంట దెబ్బతిందని అన్నదాతల ఆందోళన

**నిజామాబాద్,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ) :**

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచాయి. ఉదయం నుంచి జిల్లా అంతటా వర్షం పడింది. అయితే అకాల వర్షాల వర్షంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటకు నష్టం కలిగిందని వాపోయారు. బాన్సువాడ, బీర్కూరు మండల కేంద్రంలోని మార్కెట్‌లో రైతులు పంటను ఆరబెట్టగా వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. అకాల వర్షాలతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిముద్దయింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఆందోళ చెందుకున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతలను ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాగా, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కూడా శనివారం ఉదయం వర్షం కురిసింది.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation






## 'భజే వాయు వేగం' మోషన్ పోస్టర్ విడుదల

గతేడాది 'బెదురులంక' సినిమాతో ప్రేక్షకులను అలరించాడు టాలీవుడ్ నటుడు కార్తికేయ. ఈ సినిమా కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఈ సినిమా అనంతరం కార్తికేయ యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'భజే వాయు వేగం' అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాకు ప్రశాంత్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్ విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా మూవీ నుంచి మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్.స్పీడుగా దూసుకుపోయే కారు, డిక్కీలో డబ్బుల మూటలతో ఫుల్ యాక్షన్ ప్యాక్‌డ్‌గా సాగింది. ఇక ఈ సినిమాలో కార్తికేయ సరసన ఐశ్వర్య మీనన్ కథానాయికగా నటిస్తోంది. రాహుల్ టైసన్, తనికెళ్ల భరణి, రవిశంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్ని అందిస్తున్నారు. షూటింగ్ కూడా పూర్తయ్యింది. త్వరలోనే విడుదల తేదీని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.

## సత్యం రాజేశ్..టెనెంట్ ఫ్యామిలీ



సత్యం సినిమాతో అద్భుతమైన కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ నటుడు సత్యం రాజేశ్ ఆ తర్వాత కామెడియన్‌గా తనకంటూ సెపరేట్ ఇమేజ్ సంపాదించుకున్నాడు. ఇక ఈ కామెడియన్ హీరోగా మారిన విషయం తెలిసిందే. గతేడాది 'మా ఊరి పొలిమేర' 2 అంటూ వచ్చి సూపర్ హిట్ అందుకున్నాడు. 'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం బ్లాక్ మేజిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఈ సినిమా అనంతరం సత్యం రాజేష్ వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. తాజాగా రాజేష్ నటిస్తున్న తాజా చిత్రం టెనంట్ ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్‌గా వస్తున్న ఈ చిత్రానికి వై.యుగంధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి మేకర్స్ రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేసేలా ఈ ట్రైలర్ సాగింది. ఇక ఈ సినిమాను శ్రీరామనవమి కానుకగా ఏప్రిల్ 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రాన్ని మహాతేజ క్రియేషన్స్ బ్యానర్ పై మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రవీందర్ రెడ్డి .ఎన్ సహ నిర్మాత. మేఘా చౌదరి, చందన పయావుల, భరత్ కాంత్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సాహిత్య సాగర్ సంగీతం అందిస్తున్నారు.



## మనోజ్ దంపతులకు పాప

టాలీవుడ్ స్టార్ హీరో మంచు మనోజ్ అభిమానులకు శుభవార్త. మంచు మనోజ్ దంపతులు తల్లిదండ్రులయ్యారు. శనివారం ఉదయం మంచు మౌనిక పండంటి పాపకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని మంచు లక్ష్మి సోషల్ మీడియాలో రాసుకోస్తూ.. మా ఇంట్లోకి చిన్న దేవత వచ్చింది. మనోజ్ -మౌనిక దంపతులు పాపకి జన్మనిచ్చారు. అన్నగా ధైరవ్ సంతోషంగా ఉన్నాడు. అప్పడే తనకి ఎంఎం పులి అనే నిక్ నేమ్ కూడా పెట్టాము. శివుడి ఆశీస్సులు ఈ ఫ్యామిలీపై ఉండాలని కోరుకుంటున్నాను అని మంచు లక్ష్మి రాసుకోచ్చింది.



## అపజయాల గురించి ఆలోచించను: రష్మిక

వరుస విజయాలు అందుకుంటూ జోష్ మీద ఉన్నారు రష్మిక ఇటీవల 'యానిమల్'లో తన నటనతో మెప్పించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను విజయాలను పెద్దగా పట్టించుకోనన్నారు. దానికి గల కారణాన్ని వివరించారు. నాకంటే అందమైన, తెలివైన అమ్మాయిలు చాలామంది ఉన్నారు. వాళ్ల నటనలోనూ ప్రతిభావంతులే. మనల్ని మనం నిరూపించుకునే అవకాశం కొద్దిమందికే వస్తుంది. నాకు అలాంటి అవకాశాలు వచ్చాయి కాబట్టే ఈ స్థానంలో ఉన్నాను. నన్ను గుర్తించిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు చెప్పాలి. కెరీర్‌లో సాధించిన జయాపజయాలను పట్టించుకోకూడదు. ఏ రంగంలోనైనా అవి సాధారణం. ఇటీవలే ఈవిషయాన్ని తెలుసుకున్నాను. మనం చేసే ప్రతీ పనిని ప్రేక్షకులు గమనిస్తారు. ప్రశంసలు, విమర్శలు ఎదురవుతాయి. వాటి గురించి ఆలోచిస్తే మానసికంగా కుంగిపోతాం. జీవితంలో ముందుకుసాగలేం. అందుకే వాటిని పట్టించుకోను అని చెప్పారు. ప్రస్తుతం రష్మిక తెలుగు, హిందీల్లో వరుసగా సినిమాలు చేస్తున్నారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కిస్తున్న 'పుష్ప2'లో నటిస్తున్నారు. అందులో శ్రీవల్లిగా అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'పుష్ప' బాక్సాఫీసు వద్ద అత్యధిక వసూళ్లు రాబట్టడం, అందులోని నటనకుగాను అల్లు అర్జున్‌కు జాతీయఅవార్డు రావడం, దేవిశ్రీ ప్రసాద్‌కు ఉత్తమ సంగీత దర్శకుడిగా జాతీయ పురస్కారం దక్కడంతో ఈ సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆగస్టు 15న ఇది విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన రష్మిక లుక్‌కు మంచి ప్రేక్షకాదరణ వచ్చింది.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com